TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 44 | 26-06-2026 శుక్రవారం | పేజీలు: 08 | వెల: 3/-





## స్థానికత హక్కుల కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం



- హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో సవాల్ చేయాలి
- నాలుగేళ్ల క్రితం ఇచ్చిన తీర్పుకు పూర్తి విరుద్ధంగా తాజా తీర్పు
- ఒకే అంశంపై కోర్టు తీర్పులు మారకూడదు
- ప్రభుత్వం స్పందించకపోతే మేమే పిటిషన్ వేస్తాం
- 4 ఏళ్ల స్థానికత కాదు..
- 15 ఏళ్ల ముల్కీ నిబంధనలు కావాలి
- తెలంగాణ హక్కులను కాపాడేందుకు పోరాటం చేస్తాం
- తెలంగాణ రక్షణ సేన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత

# ప్రైవేట్ కాలేజీలకు హైకోర్టులో భారీ ఊరట

- సంచలన జీవో 9పై తాత్కాలిక స్టే..
- ప్రభుత్వం, కాలేజీల మధ్య విద్యార్థుల ఇక్కట్లు
- సర్కార్ ఆంక్షలపై కోర్టు ఆగ్రహం
- యాజమాన్యాలకు ఊరటనిచ్చిన ధర్మాసనం
- సర్కార్‌పై కోర్టు ప్రశ్నల వర్షం
- వచ్చే మంగళవారానికి విచారణ వాయిదా

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ రాష్ట్రంలో ఫీజుల వసూళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చుట్టూ తిరుగుతున్న వివాదం ఇప్పుడు న్యాయస్థానానికి చేరింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వివాదాస్పద 'జీవో 9' ప్రైవేట్ విద్యాసంస్థల ఉనికిని దెబ్బతీసేలా మిగతా 2లో..




# బాధితుల పట్ల అమర్యాదగా నడుచుకుంటే ఊరుకోం



**హైదరాబాద్, (డిడి9 వార్త):** హైదరాబాద్ పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల కొందరు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజలతో అమర్యాదగా, బాధ్యతారహితంగా మిగతా 2లో..

- పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల సిబ్బంది తీరుపై సీపీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం
- క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు డెకాయ్ ఆపరేషన్లు నిర్వహణ
- ఫిర్యాదుదారులతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నట్లు రహస్య తనిఖీల్లో వెల్లడి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్లు, బదిలీలు తప్పవని కఠిన హెచ్చరిక
- పర్యవేక్షణ లోపించినందుకు కొందరు ఇన్‌స్పెక్టర్లకు ఛార్జిమెమోలు జారీ



## తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ
# అద్భుత ఘట్టం

- మూడు రాష్ట్రాల రైతాంగానికి చారిత్రాత్మక మైలురాయి
- వివాదాలు వీడి సహకరించుకుందామన్న సీఎం రేవంత్
- కరవు ప్రాంతాల భవిష్యత్తుకు కొత్త ఆశల పల్లకి
- రాయలసీమ, పాలమూరు నీటి కష్టాలు నాకు తెలుసు..
- రైతుల కోసం రాజకీయాలు పక్కనబెట్టాలి
- సకాలంలో పరిష్కారం కాని అంతర్రాష్ట్ర జల వివాదాలు..
- సముద్రం పాలు అవుతున్న విలువైన జలాలు
- తుంగభద్ర స్ఫూర్తితోనే కృష్ణా, గోదావరి నదీ జలాల పరిష్కారం
- తెలంగాణకు రావాల్సిన 10 టీఎంసీల వాటా దక్కాలి..
- ఆర్డీఎస్ రైతుల గోడును ప్రస్తావించిన సీఎం

**హైదరాబాద్, (డిడి9 వార్త):** దక్షిణ భారతదేశంలో అత్యంత కీలకమైన నీటి వనరుగా ఉన్న తుంగభద్ర జలాశయం సరికొత్త రూపు సంతరించుకుంది. కర్ణాటకలోని మునీరాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ మరియు ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ చారిత్రాత్మక వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కొత్త గేట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుంగభద్ర జలాశయం నూతన క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ అనేది దక్షిణ భారత జలవనరుల చరిత్రలోనే ఒక చిరస్మరణీయమైన, ఎప్పటికీ గుర్తుండిపోయే అద్భుత ఘట్టంగా నిలుస్తుందని కొనియాడారు.ఈ ఆధునిక క్రస్ట్ గేట్ల నిర్మాణాన్ని కేవలం మిగతా 2లో..



## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది
# రేవంత్ ప్రభుత్వమే

### ఆరు గ్యారంటీలు గాలికొదిలేశారని విమర్శ

- జనం నెత్తిన శఠగోపం పెట్టారన్న మాజీ మంత్రి
- కేసీఆర్ హయాంలో ఐటీ, పారిశ్రామిక రంగాల ప్రగతి
- రూ.30 లక్షల నుంచి రూ.3 కోట్లకు పెరిగిన భూముల ధరలు
- నాటి బీఆర్ఎస్ విజన్‌ను గుర్తుచేసిన కేటీఆర్
- రియల్ కార్మికుల బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన
- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని హెచ్చరిక

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతూ సరికొత్త కాక రేపుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షమైన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు 'నువ్వానేనా' అనే స్థాయిలో సాగుతున్నాయి. మరోవైపు రాబోయే రోజుల్లో తమ పట్టును మరింత పెంచుకునేందుకు భారతీయ జనతా పార్టీ కూడా గట్టిగా ప్రయత్నిస్తోంది. తాము చేసిన సంక్షేమ కార్యక్రమాలే మళ్లీ గెలిపిస్తాయని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ధీమాగా చెబుతుండగా, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాల వల్ల ప్రజలు మళ్లీ తమ వైపే చూస్తున్నారని బీఆర్ఎస్ శ్రేణులు గట్టి నమ్మకంతో ఉన్నాయి. వీటికి తోడు త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు వచ్చే అవకాశం ఉండటంతో, గులాబీ దళపతి కేటీఆర్ నేరుగా సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతున్నాయి. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం, ఎస్ఐఆర్ (SIR) శిక్షణా సదస్సు గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపేలా కీలక ప్రసంగం చేశారు. "ప్రస్తుతం మన చేతిలో అధికారం లేదు, ప్రభుత్వ పగ్గాలు లేవు.. అయినా సరే మీలో ఎక్కడా గర్వం, ధైర్యం తగ్గలేదు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే సీట్లు పోయినా, ఎంపీ సీట్లు పోయినా, అధికారం చేజారినా మిగతా 2లో..



# సికింద్రాబాద్‌లో కలకలం..

- అకస్మాత్తుగా చెలరేగిన భారీ అగ్నిప్రమాదం
- దట్టమైన పొగతో బయటకు పరుగులు
- రంగంలోకి దిగిన ఫైర్ సిబ్బంది
- పాత ప్రమాదం మళ్లీ గుర్తుచేసిన ఘటన

**హైదరాబాద్, (డిడి9 వార్త):** సికింద్రాబాద్‌లోని ప్రముఖ వ్యాపార సముదాయం స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో గురువారం మరోసారి అగ్నిప్రమాదం సంభవించి తీవ్ర కలకలం రేపింది. కాంప్లెక్స్ నుంచి అకస్మాత్తుగా భారీగా మంటలు, దట్టమైన పొగలు వ్యాపించడంతో లోపల ఉన్న వ్యాపారులు, సందర్శకులు భయాందోళనలతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న మిగతా 2లో..

## నల్గొండ హత్యల కేసులో
# సంచలన మలుపు

- పక్కా ప్లాన్‌తోనే సుపారీ గ్యాంగ్ ఘాతుకం
- పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు
- ఆధారాలు దొరక్కుండా పక్కా వ్యూహం..
- పదునైన ఆయుధాలతో విచక్షణారహితంగా దాడి..
- పోస్ట్‌మార్టం, ఫోరెన్సిక్ నివేదికల్లో షాకింగ్ విషయాలు
- కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలే కారణమా?
- నిందితుల రహస్య విచారణ



**నల్గొండ, (డిడి9 వార్త):** నల్గొండ జిల్లా కేంద్రంలోని తెలంగాణ కాలనీలో ఇటీవల వెలుగుచూసిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురి అనుమానాస్పద మృతి కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. మొదట్లో ఇది ఆత్మహత్య కావచ్చునని భావించినప్పటికీ, పోలీసుల లోతైన దర్యాప్తులో ఇదో పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన ఘోర నరమేధమని తేలింది. ఇంటి యజమాని మహ్మద్ సుల్తాన్ (45), ఆయన భార్య హసీనా (38), కుమారుడు ముజామిల్(20), కుమార్తె అఫోర(14)లను గుర్తుతెలియని నిందితులు విచక్షణారహితంగా దాడి చేసి అతి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ దారుణ ఉదంతం వెనుక పెద్ద కుట్రే దాగి ఉందని నిర్ధారణ కావడంతో ఈ కేసు ఒక్కసారిగా కీలక మలుపు తిరిగింది. ఈ నెల 22వ తేదీన ఈ దారుణ హత్యలు వెలుగులోకి వచ్చాయి. హంతకులు అత్యంత తెలివిగా మిగతా 2లో..



# వెనెజువెలాలో మహా ప్రళయం

**వెనెజువెలా, (డిడి9 వార్త):** దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాలో ప్రకృతి ఒక్కసారిగా కన్నెర్ర జేసింది. దారుణ వరుస భూకంపాల ధాటికి దేశం మొత్తం వణికిపోయింది. అమెరికా భూగర్భ సర్వే సంస్థ (యూఎస్‌జీఎస్) వెల్లడించిన అధికారిక వివరాల ప్రకారం, రాజధాని కారకాస్ నగరానికి పశ్చిమ దిశలో ఉన్న శాన్ ఫెలిపే ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని మొదట రిక్టర్ స్కేలుపై 7.2 తీవ్రతతో అత్యంత శక్తివంతమైన భూకంపం సంభవించింది. ఈ భీభత్సం నుంచి ప్రజలు కోలుకోకముందే, కేవలం కొద్ది క్షణాల వ్యవధిలోనే యుమారే ప్రాంతంలో 7.5 తీవ్రతతో రెండో భూకంపం భూభాగాన్ని కుదిపేసింది. ఒకే ప్రాంతంలో దాదాపు ఒకే సమయంలో ఇంతటి తీవ్రమైన భూకంపాలు రావడం వల్ల ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లింది.

ఈ ఘోర విపత్తు నేపథ్యంలో వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెజ్ దేశవ్యాప్తంగా మిగతా 3లో..

- వరుస భూకంపాలతో అతలాకుతలం
- 164 మంది పౌరుల మృతి
- లక్ష మంది మృతి చెందొచ్చన్న యూఎస్‌జీఎస్
- ఒక్కసారిగా వణికిపోయిన వెనెజువెలా దేశం
- దేశంలో అత్యవసర పరిస్థితి విధిస్తూ ప్రకటన
- యుద్ధప్రాతిపదికన శిథిలాల తొలగింపు..
- కొనసాగుతున్న ఆర్తనాదాలు, రెస్క్యూ ఆపరేషన్స్
- వైద్యం అందక క్షతగాత్రుల రోదన
- కుప్పకూలిన విద్యుత్, సమాచార నెట్‌వర్క్‌లు
- వెనెజువెలాకు అండగా ఉంటామన్న డొనాల్డ్ ట్రంప్
- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ

# ప్రైవేట్ కాలేజీలకు హైకోర్టులో భారీ ఊరట

**మొదటిపేజీ తరువాయి**

ఉందంటూ పలు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాయి. ఈ జీవోలో పొందుపరిచిన కొన్ని కఠినమైన నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ఉన్నత ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న న్యాయస్థానం, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు తాత్కాలికంగా ఊరట కలిగిస్తూ సదరు జీవోలోని కొన్ని వివాదాస్పద నిబంధనలపై అత్యవసర స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వం జారీ చేసిన జీవో 9 ప్రకారం.. ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయకూడదనే ప్రధాన ఆంక్షను విధించారు. దీనిపై యాజమాన్యాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో అందడం లేదని, కనీసం విద్యార్థుల నుంచి కూడా ఫీజులు తీసుకోనివ్వకపోతే తాము కాలేజీలను ఎలా నడపాలని ప్రశ్నించాయి. ఈ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు, విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలపై వచ్చే మంగళవారం వరకు మధ్యంతర స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ తాత్కాలిక ఆదేశాలు ప్రైవేట్ కాలేజీల నిర్వహణకు కొంత వెసులుబాటు కల్పించాయి.

ప్రైవేట్ కళాశాలల పిటిషన్లపై జరిగిన విచారణ సందర్భంగా హైకోర్టు ధర్మాసనం ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రభుత్వ లాయర్‌ను నిలదీస్తూ వరుస ప్రశ్నలు సంధించింది. "ప్రభుత్వం తరఫున ప్రైవేట్ కాలేజీలకు ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను మీరూ సకాలంలో చెల్లించరు.. అటువంటప్పుడు కనీసం కాలేజీల నిర్వహణ కోసం విద్యార్థుల నుంచి కూడా ఫీజులు వసూలు చేసుకోనివ్వరా? మరి కాలేజీలు ఎలా నడుస్తాయి? సిబ్బందికి జీతాలు ఎలా ఇస్తారు?" అని ధర్మాసనం నిలదీసింది. అసలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో ఎంత కేటాయించారు? పాత బకాయిలను ఎందుకు నిలిపివేశారు? వాటిని ఎప్పటిలోగా విడుదల చేస్తారో స్పష్టమైన సమాధానం చెప్పాలని ఆదేశించింది.

హైకోర్టు ధర్మాసనం అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ కోర్టుకు వివరణ ఇచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సాంకేతిక మరియు పరిపాలనాపరమైన కొన్ని కారణాల వల్ల బకాయిల విడుదలలో కొంత ఆలస్యం జరిగిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాబోయే ఆగస్టు 15వ తేదీ లోపు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కళాశాలలకు చెల్లించాల్సిన అన్ని రకాల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను ప్రభుత్వం పూర్తిగా క్లియర్ చేస్తుందని, ఇందుకు సంబంధించిన నిధులను విడుదల చేయడానికి అవసరమైన ఏర్పాట్లు సాగుతున్నాయని ప్రభుత్వ లాయర్ న్యాయస్థానానికి అధికారికంగా విన్నవించారు.

ప్రభుత్వ లాయర్ ఇచ్చిన హామీపై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల తరఫు న్యాయవాదులు కోర్టులో తమ వాదనను గట్టిగా వినిపించారు. గతంలోనూ ప్రభుత్వం ఇలాంటి హామీలు ఇచ్చి అమలు చేయలేదని గుర్తు చేశారు. అయితే, కోర్టు సమక్షంలో ప్రభుత్వం ఇచ్చిన తాజా గడువును తాము గౌరవిస్తామని చెప్పారు. ప్రభుత్వ లాయర్ చెప్పినట్లుగా ఆగస్టు 15వ తేదీ లోపు కాలేజీలకు రావాల్సిన వందలాది కోట్ల రూపాయల ఫీజు బకాయిలన్నీ పూర్తిగా యాజమాన్యాల ఖాతాల్లో జమ అయితే.. ఆ మరుసటి క్షణమే తాము కోర్టులో వేసిన అన్ని పిటిషన్లను వెనక్కి తీసుకుంటామని (విత్‌డ్రా చేసుకుంటామని) యాజమాన్యాలు స్పష్టం చేశాయి.

ఈ ఫీజుల వివాదం కేవలం ప్రభుత్వం, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల మధ్యే కాకుండా విద్యార్థుల భవిష్యత్తును సైతం ప్రశ్నార్థకంగా మార్చింది. దీంతో ఈ కేసులో విద్యార్థులు కూడా తాము నష్టపోతున్నామంటూ హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. విద్యార్థుల తరఫు లాయర్ కోర్టులో వాదనలు వినిపిస్తూ.. "ఇక్కడ ప్రభుత్వం, కాలేజీల యాజమాన్యాల మధ్య జరుగుతున్న పోరాటంలో అమాయక విద్యార్థులు నలిగిపోతున్నారు. కాలేజీలు ఫీజులు కట్టమంటున్నాయి.. ప్రభుత్వం వద్దేమో జీవోలు ఉన్నాయి. ఈ బకాయిల గొడవల వల్ల విద్యా సంవత్సరం పాడవకుండా, విద్యార్థులు మానసికంగా నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కోర్టుపై ఉంది" అని విజ్ఞప్తి చేశారు.

ఫీజుల వసూళ్లకు సంబంధించిన ఆంక్షలు లేదా కోర్టు ఇచ్చే ఎలాంటి ఆదేశాలైనా ప్రస్తుత విద్యా సంవత్సరంలో కొత్తగా కాలేజీల్లో చేరిన విద్యార్థులకు మాత్రమే వర్తించేలా చూడాలని విద్యార్థుల తరఫు న్యాయవాది ధర్మాసనానికి ప్రత్యేకంగా విన్నవించారు. పాత విద్యార్థులకు ఇప్పటికే ఫీజుల విధానంపై ఒక స్పష్టత ఉందని, ఇప్పుడు కొత్తగా నిబంధనలు మారిస్తే అందరూ ఇబ్బంది పడతారని చెప్పారు. ప్రభుత్వం, యాజమాన్యాలు తమ పంతాలకు పోయి విద్యార్థుల విద్యా హక్కుకు భంగం కలిగించకుండా న్యాయస్థానమే తగిన దిశానిర్దేశం చేయాలని కోరారు.

ఇరుపక్షాల సుదీర్ఘ వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం.. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు కాలేజీల నిర్వహణ కూడా ముఖ్యమేనని అభిప్రాయపడింది. అందుకే వివాదాస్పద జీవో 9పై తాత్కాలికంగా స్టే విధిస్తూ, కేసు తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. ఆ రోజున ప్రభుత్వం మరిన్ని వివరాలతో కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. హైకోర్టు తీసుకున్న ఈ తాత్కాలిక నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులలో రాబోయే మంగళవారం కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# సికింద్రాబాద్‌లో కలకలం..

**మొదటిపేజీ తరువాయి**

అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, ఫైర్ టెండర్ల సహాయంతో మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. దట్టమైన పొగ కారణంగా సహాయక చర్యలకు కొంత ఆటంకం ఏర్పడినప్పటికీ, లోపల ఎవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కాంప్లెక్స్ లోని మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ముందుగా.. వ్యాక్స్ కన్సల్టింగ్ సొల్యూషన్స్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. కార్యాలయంలో దేవుడికి పెట్టిన దీపం ద్వారా వైర్లకు అంటుకొని షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు అగ్నిమాపక అధికారులు భావిస్తున్నారు.

గతంలో కూడా ఇదే స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి పెద్ద ఎత్తున ఆస్తి నష్టంతో పాటు ప్రాణనష్టం సంభవించిన సంగతి తెలిసిందే. ఆ చేదు జ్ఞాపకాలు ఇంకా మరువక ముందే, నిబంధనల అమలులో నిర్లక్ష్యం కారణంగా మళ్లీ అదే భవనంలో ప్రమాదం పునరావృతం కావడంపై స్థానికులు, వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవనంలో సరైన అగ్నిమాపక రక్షణ ఏర్పాట్లు లేకపోవడమే ఈ వరుస ప్రమాదాలకు కారణమనే విమర్శలు వ్యక్తమవుతుండగా, ప్రస్తుత ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు , నష్ట తీవ్రతకు సంబంధించిన పూర్తి వివరాలు అగ్నిమాపక సిబ్బంది విచారణ అనంతరం తెలియాల్సి ఉంది.



# తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ అద్భుత ఘట్టం

**మొదటిపేజీ తరువాయి**

ఒక ఇంజినీరింగ్ అద్భుతంగా లేదా సాంకేతిక విజయంగా మాత్రమే చూసి వదిలేయలేమని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టు ఆధునికీకరణ వెనుక మూడు రాష్ట్రాల పరిధిలోని లక్షలాది మంది రైతుల జీవనరేఖ దాగి ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని ఎన్నో ఏళ్లుగా కరవుతో అల్లాడుతున్న జిల్లాలకు, అక్కడి వ్యవసాయ రంగానికి ఈ ప్రాజెక్టు పునరుద్ధరణ ఒక సరికొత్త మైలురాయిగా మారుతుందని చెప్పారు. ఎండిపోతున్న పొలాలకు ఈ నూతన గేట్లు మళ్లీ జీవం పోసి, రైతాంగ భవిష్యత్తుకు సరికొత్త ఆశల పల్లకిని మోస్తాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో కరవు ప్రాంతాల రైతుల ఇబ్బందులను సుదీర్ఘంగా ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాలైన కర్నూలు, అనంతపురం ప్రాంతాలతో పాటు తెలంగాణలోని పాలమూరు (మహబూబ్‌నగర్) జిల్లా ప్రజలు ఎదుర్కొన్న సాగునీటి, తాగునీటి కష్టాలు తనకు చాలా దగ్గరగా తెలుసన్నారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతాల ప్రజలు నీటి కోసం పడిన గోడును తాను కళ్లారా చూశానని గుర్తు చేసుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ ప్రయోజనాలను, ప్రాంతీయ వివాదాలను పూర్తిగా పక్కనబెట్టి, కేవలం అన్నదాతల శ్రేయస్సును మాత్రమే ముఖ్యాంశంగా తీసుకుని అన్ని ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.

రాష్ట్రాల మధ్య తలెత్తుతున్న నీటి పంపకాల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి కొంత ఆవేదన వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రాల మధ్య వివిధ కారణాల వల్ల నదీ జలాల వివాదాలు సకాలంలో పరిష్కారం కాకపోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ పట్టింపుల వల్ల వర్షాకాలంలో వరదలు వచ్చినప్పుడు వాడుకోవాల్సిన విలువైన జలాలు ఏటా భారీగా వృథాగా సముద్రంలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి కొరత ఉన్న దేశంలో ఒక్క చుక్క నీరు కూడా వృథా కాకుండా చూసుకోవాలని, అందుకు వివాదాలను వీడి సానుకూల దృక్పథంతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

ప్రస్తుతం తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ విషయంలో మూడు రాష్ట్రాలు చూపించిన చొరవ మరియు సమిష్టి స్ఫూర్తిని రేవంత్ రెడ్డి అభినందించారు. ఇదే అవగాహన, స్నేహపూర్వక వాతావరణాన్ని ముమ్ముందు కూడా కొనసాగించాలని కోరారు. తుంగభద్ర వేదికగా ప్రారంభమైన ఈ సరికొత్త సమిష్టి స్ఫూర్తితోనే, రాబోయే రోజుల్లో తెలుగు రాష్ట్రాల మధ్య ఎంతో కాలంగా నలుగుతున్న కృష్ణా, గోదావరి నదీ జలాల పంపకాల సమస్యలకు కూడా శాశ్వత, పారదర్శక పరిష్కారాలు లభిస్తాయని తాను గట్టిగా ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఈ అంతర్రాష్ట్ర వేదికపైనే తెలంగాణకు సంబంధించిన ఒక అత్యంత కీలకమైన, న్యాయపరమైన జలవనరుల అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి ధైర్యంగా ప్రస్తావించారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి చట్టబద్ధంగా తెలంగాణ రాష్ట్రానికి దక్కాల్సిన 10 టీఎంసీల నీరు ఇప్పటికీ పూర్తి స్థాయిలో రావడం లేదని ఆయన గుర్తు చేశారు. దీనివల్ల రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీఎస్ పరిధిలోని మన రైతులకు న్యాయం జరగాలంటే తెలంగాణకు రావాల్సిన పూర్తి నీటి వాటాను సకాలంలో విడుదల చేయాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ సరిహద్దు రైతుల హక్కులను కాపాడే విషయంలో పొరుగున ఉన్న కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పెద్దన్న పాత్ర పోషించాలని, ఎల్లప్పుడూ సహకార భావంతో వ్యవహరించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నదీ జలాల వినియోగంలో ఏ ఒక్క రాష్ట్రం స్వార్థంతో ఆలోచించినా ప్రయోజనం ఉండదన్నారు. పొరుగు రాష్ట్రాలన్నీ పరస్పర నమ్మకం, అవగాహన, గౌరవంతో ముందుకు సాగితేనే కృష్ణా, తుంగభద్ర బేసిన్ పరిధిలోని మూడు రాష్ట్రాల రైతాంగానికి దీర్ఘకాలికంగా మేలు జరుగుతుందని, పంటలు సమృద్ధిగా పండుతాయని రేవంత్ రెడ్డి గట్టిగా చెప్పారు.

ఈ పర్యటనలో భాగంగా మూడు రాష్ట్రాల ప్రతినిధులు, ఉన్నతాధికారుల మధ్య జరిగిన అంతర్గత చర్చలు అత్యంత సానుకూల వాతావరణంలో జరిగాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రైతుల సంక్షేమమే పరమావధిగా ఈ చర్చలు సాగాయన్నారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి జల వివాదాలు తలెత్తినా కోర్టుల చుట్టూ తిరగకుండా, ఇలాగే ఒకే వేదికపై కూర్చుని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలనే సంకల్పాన్ని వ్యక్తంచేశారు. మొత్తానికి, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ తుంగభద్ర నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం దక్షిణ భారతదేశంలో ఒక సరికొత్త జల విప్లవానికి, అంతర్రాష్ట్ర సత్సంబంధాలకు బాటలు వేసింది.

# రేవంత్ రియల్ ఎస్టేట్‌ను బొందపెట్టారు

**మొదటిపేజీ తరువాయి**

ఇంతమంది సోదరులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఇక్కడ చూపిస్తున్న సంఘీభావం సామాన్యమైనది కాదు. ఈ అద్భుత దృశ్యాన్ని చూస్తుంటే అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ పార్టీల గుండెల్లో రైళ్లు ఉరుకుతున్నాయి" అంటూ కేటీఆర్ ఉద్ఘాటించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా ప్రజలకు చేసిందేమీ లేదని కేటీఆర్ దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి తనను తాను ఒక 'గుంపు మేస్త్రీ'గా చెప్పుకున్నారని ఆయన ఎద్దేవా చేశారు. "రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి.. రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్ అంటూ నాడు రంగురంగుల పోజులు కొట్టారు. కానీ ఈరోజు అధికారంలోకి వచ్చాక అదే రియల్ ఎస్టేట్ రంగాన్ని ఏం చేశారు? పూర్తిగా బొంద పెట్టారు. వంద ఫీట్ల లోతున పాతిపెట్టే దారుణమైన పని చేశారు" అంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ తప్పుడు విధానాల వల్లే రాష్ట్రంలో భూముల కొనుగోళ్లు, అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయాయని ఆరోపించారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు కేవలం ఓట్ల కోసమేనని ఇప్పుడు స్పష్టమైందని కేటీఆర్ విమర్శించారు. రైతు భరోసా, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500, నిరుద్యోగ భృతి వంటి అనేక హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారని, కానీ గద్దెనెక్కాక ఆ హామీలన్నింటినీ అటకెక్కించారని మండిపడ్డారు. గడిచిన రెండున్నరేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదని, ఇది స్పష్టమైన వాగ్దాన భంగమని దుయ్యబట్టారు. ప్రజాపాలన పేరుతో ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్పి, చివరకు సామాన్య జనం నెత్తిన శఠగోపం పెట్టారని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వంలో తెలంగాణ అంతటా, ముఖ్యంగా చేవెళ్ల పరిసర ప్రాంతాల్లో జరిగిన పారిశ్రామిక అభివృద్ధిని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో షాబాద్ పరిధిలోని చందన్‌వెల్లి, సీతారాంపూర్ ప్రాంతాల్లో ఎకరం భూమి ధర కేవలం రూ.30 లక్షలు మాత్రమే ఉండేదని చెప్పారు. తాము అధికారంలో ఉన్నప్పుడు అక్కడ అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో భారీ పారిశ్రామిక పార్కులను తీసుకువచ్చామని, ఐటీ రంగంతో పాటు వినూత్న మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా ఆయా ప్రాంతాల రూపురేఖలనే పూర్తిగా మార్చేశామని కేటీఆర్ స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ విజన్ కారణంగానే చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోకి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన దిగ్గజ కంపెనీలు తరలివచ్చాయని కేటీఆర్ గర్వంగా ప్రకటించారు. మైక్రోసాఫ్ట్, అమెజాన్ , వెల్స్‌ఫన్ వంటి మల్టీనేషనల్ కార్పొరేషన్లు తమ హయాంలోనే ఇక్కడ వందల కోట్ల పెట్టుబడులు పెట్టాయన్నారు. ఈ భారీ పరిశ్రమల రాకతో నాడు రూ.30 లక్షలు పలికిన ఎకరం భూమి ధర, నేడు షాబాద్, చేవెళ్ల పరిసరాల్లో రూ.3 కోట్లకు పైగా పెరిగిందని లెక్కలతో సహా వివరించారు. ఈ ప్రాంతాన్ని ఒక గ్లోబల్ హబ్‌గా మార్చిన ఘనత ముమ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వానిదేనని కేటీఆర్ స్పష్టం చేశారు.

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తీసుకుంటున్న అవగాహన లేని నిర్ణయాల వల్ల రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది తమ్ముళ్లు, చెల్లెళ్లు, కార్మికుల బతుకులు ఈరోజు రోడ్డున పడ్డాయన్నారు. బిల్డర్లు, మేస్త్రీలు, కూలీలు, సెంటిమెంట్ల వ్యాపారులు అంతా దివాళా తీసే దారుణమైన పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ పడిపోవడంతో దానికి అనుబంధంగా ఉండే సిమెంట్, స్టీల్, రవాణా రంగాలు కూడా తీవ్ర నష్టాల్లో కూరుకుపోయాయని, ఎందుకీ దుస్థితి వచ్చిందో రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరూ మరియు యువత లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను, ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను బీఆర్ఎస్ కార్యకర్తలు నిరంతరం నిలదీస్తూనే ఉంటారని కేటీఆర్ స్పష్టం చేశారు. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలతో పాటు తదుపరి వచ్చే అన్ని ఎన్నికల్లోనూ గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను, అస్తవ్యస్త ఆర్థిక విధానాలను ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ మార్కు సంక్షేమ పాలనను మళ్లీ కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మరింత శక్తివంతంగా పుంజుకుని తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

# బాధితుల పట్ల అమర్యాదగా నడుచుకుంటే ఊరుకోం

**మొదటిపేజీ తరువాయి**

ప్రవర్తిస్తున్న సిబ్బందిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి నేర సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

"కష్టాల్లో ఉండి, మానసిక వేదనతో ఆసరా కోసం పోలీస్ స్టేషన్ గడప తొక్కే ప్రజలతో వ్యవహరించాల్సిన పద్ధతి ఇదేనా?" అంటూ అధికారులను సజ్జనార్ నిలదీశారు. కొన్ని స్టేషన్లలో రిసెప్షనిస్టులు, పరిపాలనా బాధ్యతలు చూసే అడ్మిన్ ఎస్సైల ప్రవర్తన సరిగా లేదని, సమయపాలన కూడా పాటించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్యవేక్షణ లోపించినందుకు కొందరు ఇన్‌స్పెక్టర్లకు ఇప్పటికే ఛార్జిమెమోలు జారీ చేసినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సీపీ సజ్జనార్ ఒక వినూత్న వ్యూహాన్ని అమలు చేశారు. ఆయన స్వయంగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారు. కొందరు పోలీసు అధికారులనే సాధారణ పౌరులుగా, సివిల్ డ్రెస్‌లో ఫిర్యాదులు చేసేందుకు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు పంపించారు. అక్కడ సిబ్బంది స్పందించిన తీరు, వారికి ఎదురైన అనుభవాలపై నివేదిక తెప్పించుకున్నారు.

ఈ రహస్య ఆపరేషన్‌లో దాదాపు 12 పోలీస్ స్టేషన్లలో సిబ్బంది తీరు దారుణంగా ఉన్నట్లు వెల్లడైంది. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వారితో రిసెప్షనిస్టులు, ఏఎస్సైలు కఠినంగా మాట్లాడటం, అది తమ పరిధిలోకి రాదంటూ పక్క స్టేషన్లకు నెట్టేయడం, సూటిపోటి మాటలతో వేధించడం వంటివి ఈ తనిఖీల్లో బయటపడ్డాయి. అంతేకాకుండా, ఫిర్యాదును వెంటనే స్వీకరించకుండా 'రేపు రా.. మాపు రా..' అంటూ బాధితులను రోజుల తరబడి తిప్పించుకున్నట్లు స్పష్టమైంది.

ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి సజ్జనార్ భావోద్వేగంగా మాట్లాడారు. "మీ కుటుంబ సభ్యులే ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు, అక్కడ ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులే ఎదురైతే మీరెలా భావిస్తారో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోండి" అని హితవు పలికారు. ఇకపై ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహిస్తే సస్పెన్షన్లు, బదిలీలు తప్పవని ఆయన గట్టిగా హెచ్చరించారు.

# నల్గొండ హత్యల కేసులో సంచలన మలుపు

**మొదటిపేజీ తరువాయి**

వ్యవహరించి, ఘటనా స్థలంలో వేలిముద్రలు కానీ, తాము వాడిన వస్తువులు కానీ దొరక్కుండా జాగ్రత్తపడ్డారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌కు కూడా తొలుత ఎలాంటి కీలక ఆధారాలు లభించలేదు. అయినప్పటికీ నల్గొండ పోలీసులు సవాలుగా తీసుకుని క్షేత్రస్థాయిలో గాలించారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీలు, పాత నేరస్థుల రికార్డులను పరిశీలించి చివరకు ఈ పాడుపనికి ఒడిగట్టిన ఒక సుపారీ (హంతక) గ్యాంగ్‌ను గుర్తించారు. ఈ ముఠాలోని ఆరుగురు సభ్యులను పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా అదుపులోకి తీసుకుని, ఓ రహస్య ప్రాంతంలో ఉంచి విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మృతదేహాలను పరిశీలించిన వైద్యులు, ఫోరెన్సిక్ నిపుణులు నివేదికలో షాకింగ్ విషయాలను వెల్లడించారు. బాధితుల శరీరాలపై తీవ్రమైన గాయాలు ఉన్నాయని, చనిపోయే ముందు వారు తీవ్రంగా నిరోధించడానికి ప్రయత్నించారని తేలింది. హంతకులు వేటకొడవళ్లు లేదా పదునైన చాకులతో నలుగురిపై విచక్షణారహితంగా దాడి చేసి కిరాతకంగా నరికి చంపినట్లు ఫోరెన్సిక్ రిపోర్టులో స్పష్టమైంది. తల, మెడ భాగాలపై బలంగా గాయాలు కావడంతోనే వారు అక్కడికక్కడే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఇది ముమ్మాటికీ అద్దె హంతకులతో చేయించిన పక్కా స్కెచ్ అని పోలీసులు ఒక ముగింపునకు వచ్చారు.

ఈ దారుణ హత్యలకు కుటుంబ వివాదాలు లేదా ఆస్తి తగాదాలే ముఖ్య కారణమై ఉండవచ్చని పోలీసులు బలంగా అనుమానిస్తున్నారు. నల్గొండ నగరంలోని ప్రకాశంబజార్‌లో సుల్తాన్ బ్యాగులు విక్రయించే వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన మొదటి భార్య గతంలోనే మరణించగా, హసీనాను రెండో వివాహం చేసుకున్నారు. ఇప్పుడు చనిపోయిన పిల్లలిద్దరూ మొదటి భార్య సంతానమని స్థానికులు చెబుతున్నారు. హసీనా ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పని చేస్తుండగా, కొడుకు ముజామిల్ ఏసీ టెక్నీషియన్‌గా చేస్తున్నాడు. అయితే, గత కొంతకాలంగా సుల్తాన్, హసీనా దంపతుల మధ్య తీవ్ర మనస్పర్థలు ఉన్నాయని, సుల్తాన్ తరచూ మద్యం సేవించి ఇంట్లో గొడవపడేవాడని పొరుగువారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.

పోలీసుల టైమ్‌లైన్ విశ్లేషణ ప్రకారం జూన్ 19వ తేదీ రాత్రి ఈ ఘోరం జరిగినట్లు తెలుస్తోంది. ఆ రోజు రాత్రి సుల్తాన్ వ్యాపారం ముగించుకుని ఇంటికి రాగా, కొడుకు ముజామిల్ కూడా రాత్రి 10 గంటల ప్రాంతంలో పని ముగించుకుని వచ్చాడు. అయితే ఆ రోజు అర్ధరాత్రి 11 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 4 గంటల మధ్య ఆ ఇంట్లోకి సుపారీ గ్యాంగ్ ప్రవేశించినట్లు భావిస్తున్నారు. ఆ సమయంలో సదరు ఇల్లు ఉన్న వీధిలో భయంకరమైన 'బచావో.. బచావో' (కాపాడండి) అనే ఆర్తనాదాలు, హాహాకారాలు వినవచ్చాయని స్థానికులు కొందరు పోలీసుల ఎదుట నోరు విప్పారు. కానీ, సాధారణ కుటుంబ గొడవలే కావచ్చని భావించి ఎవరూ అటువైపు వెళ్లలేదని, తీరా చూసేసరికి నలుగురూ శవాలై కనిపించారని కన్నీరుమున్నీరవుతున్నారు.

హంతకులు ఎంతటి క్రూరులంటే.. నలుగురిని ప్రాణాలు పోయే వరకు నరికి చంపిన తర్వాత, వారి మృతదేహాలు బయటకు కనిపించకుండా ఇళ్లలో ఉండే చద్దర్లను (దుప్పట్లు) వాటిపై కప్పేశారు. ఆ తర్వాత తాము వచ్చిన పని ముగించుకుని హ్యాపీగా బయటకు వచ్చి, ఇంట్లో ఎవరూ లేరనే భ్రమ కలిగించడానికి వీధి వైపు ఉన్న ప్రధాన గేటుకు పక్కాగా తాళం (లాక్) వేసి పారిపోయారు. ఇలా చేయడం వల్ల శవాలు కుళ్లిపోయే వరకు ఎవరికీ అనుమానం రాదని, ఆధారాలు సేకరించడం పోలీసులకు కష్టసాధ్యంగా మారుతుందని హంతకులు భావించారు. కాలనీలో దుర్వాసన రావడంతోనే ఈ దారుణ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పోలీసులు ఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు ఇల్లంతా చెల్లాచెదురుగా పడి ఉంది. బెడ్‌రూమ్‌లోని బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. బట్టలు, ఇతర వస్తువులన్నీ కింద పడేసి ఉన్నాయి. దీన్ని బట్టి హంతకులు ఇంట్లో ఉన్న భారీ నగదు, బంగారు ఆభరణాలను దోచుకెళ్లినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే గతంలో కూడా ఇదే సుల్తాన్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి భారీ దోపిడీకి పాల్పడినట్లు నల్గొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఉంది. ఆ పాత దొంగతనం కేసుతో ఈ నలుగురి హత్యలకు ఏమైనా లింకు ఉందా? లేదా దోపిడీ దొంగలే ఈ ఘాతుకానికి ఒడిగట్టారా? అనే కోణాన్ని కూడా పోలీసులు వదిలిపెట్టడం లేదు.

ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న ఆరుగురు సుపారీ గ్యాంగ్ సభ్యుల విచారణ అత్యంత రహస్యంగా సాగుతోంది. నల్గొండ జిల్లా ఎస్పీ స్వయంగా ఈ కేసును పర్యవేక్షిస్తున్నారు. కేవలం డబ్బు కోసమే ఈ అద్దె హంతకులు ఇంతటి దారుణానికి ఒడిగట్టారా? లేక ఈ కుటుంబంతో శత్రుత్వం ఉన్నవారెవరైనా వీరికి పెద్ద మొత్తంలో డబ్బు ఆశ చూపి సుపారీ ఇచ్చారా? అనే విషయాలు తేలాల్సి ఉంది. ఈ ముఠా నోరు విప్పితే, ఈ దారుణ నరమేధానికి వెనుక ఉండి నడిపించిన అసలు సూత్రధారులు, వారి కుటుంబ నేపథ్యం, ఆస్తి వివాదాల పూర్తి వివరాలు అధికారికంగా వెలుగులోకి వస్తాయి.



## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న యువనేత మియాపురం శశికాంత్

- స్మశానవాటికలో విద్యుత్ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు
- గ్రామస్థుల ప్రశంసలు

**బీర్కూర్, జూన్ 25(డిడి9 వార్త):**

ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ, ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే నాయకత్వం అరుదుగా కనిపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ యువనేత మియాపురం శశికాంత్ గ్రామస్థుల ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేవలం వినడమే కాకుండా, వాటి పరిష్కారానికి వెంటనే స్పందిస్తూ తన పనితీరుతో ప్రజల విశ్వాసాన్ని పొందుతున్నారు.నాలుగు రోజుల క్రితం గ్రామ స్మశానవాటికలో విద్యుత్ సౌకర్యం లేకపోవడం వల్ల దహన సంస్కారాల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు మియాపురం శశికాంత్ దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్యంగా రాత్రి సమయంలో విద్యుత్ లేకపోవడం వల్ల అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని, స్మశానవాటిక వద్ద కనీస సౌకర్యాలు కూడా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు.ఈ సమస్యపై స్పందించిన శశికాంత్ ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత ట్రాన్స్కో అధికారులతో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. ప్రజలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను కల్పించడం అధికారుల బాధ్యత అని తెలియజేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఆయన చొరవతో స్పందించిన అధికారులు గురువారం స్మశానవాటిక వద్ద విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను ప్రారంభించారు. త్వరలోనే విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యను తక్కువ సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం పట్ల గ్రామస్థులు మియాపురం శశికాంత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ముందుండి పనిచేస్తున్నారని కొనియాడారు .ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ యమరాములు, మాజీ ఎంపీపీ రఘు, వార్డు సభ్యులు కొరిమె రఘు, ప్రశాంత్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మేకల విట్టల్, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## సర్వే ప్రక్రియపై ప్రజలు ఆందోళన చెందవద్దు

- కౌన్సిలర్ అలీమ్ రజా

**బోధన్, నిజామాబాద్ జూన్25(డీడీ9 వార్త):**

బోధన్ పట్టణంలోని 12వ వార్డులో ఎస్ఐఆర్ ఆధ్వర్యంలో జరుగుతున్న డోర్‌టుడోర్ ఫారమ్‌ల పంపిణీ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ అలీమ్ రజా పిలుపునిచ్చారు. తమ వార్డులో మొత్తం 56 బూత్‌లు ఉండగా అందులో భాగంగా ఇప్పటికే పలు బూత్‌లలో పారదర్శకంగా ఫారమ్‌లను పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. బూత్ నంబర్ 54లో 194 ఫారమ్‌లు, బూత్ నంబర్ 55లో 155 ఫారమ్‌లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఫారమ్‌లు నింపే విషయంలో ప్రజలకు ఏవైనా సందేహాలు ఉంటే ఏంఐఏం పార్టీకి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు వారికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఒక వారం తర్వాత పూర్తి చేసిన ఫారమ్‌లను సేకరించేందుకు సిబ్బంది ఇంటింటికీ వస్తారని, కావున ప్రజలు ఆందోళన చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు.

## చెక్కికాంప్‌లో ఘనంగా ఆంజనేయ స్వామి వార్షికోత్సవం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్25(డీడీ9 వార్త):**

బోధన్ మండలం చెక్కికాంప్‌లోని శ్రీ శివపంచయతన అభయ ఆంజనేయ స్వామి దేవాలయ 10వ వార్షికోత్సవ వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. నిజ జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ, నవగ్రహ హోమాలు, ఆంజనేయ స్వామి వారికి లక్ష తమలపాకుల పూజ, విశేష అభిషేకాలను అర్చకులు భక్తిపూర్వకంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఈ కార్యక్రమాలను విజయవంతం చేశారు.




# వెనెజువెలాలో మహా ప్రళయం

**మొదటిపేజీ తరువాయి**

అత్యవసర పరిస్థితిని విధిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశ ప్రజలను ఉద్దేశించి ఆమె జాతీయ టెలివిజన్ ఛానల్ ద్వారా అత్యంత ఆవేదనతో మాట్లాడారు. ఈ భూకంపాల వల్ల ఇప్పటి వరకు అధికారిక లెక్కల ప్రకారం 164 మంది దుర్మరణం పాలయ్యారని, మరో 971 మంది తీవ్రంగా గాయపడ్డారని ఆమె ధ్రువీకరించారు. విపత్తులో తమ కళ్ల ముందే కుటుంబ సభ్యులను, ఆత్మీయులను కోల్పోయి రోదిస్తున్న బాధితులకు ఆమె ప్రభుత్వం తరపున సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వ యంత్రాంగం అంతా ప్రాణాలు కాపాడే పనిలోనే నిమగ్నమై ఉందని చెప్పారు.

భూకంప తీవ్రతకు రాజధాని కారకాస్ నగరంతో పాటు చుట్టుపక్కల ఉన్న వందలాది నివాస, వాణిజ్య భవనాలు చేతులెత్తేసి ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. దీంతో భారీ కాంక్రీట్ శిథిలాల కింద వేలాది మంది ప్రజలు చిక్కుకుపోయి ఉంటారని అధికారులు బలంగా అనుమానిస్తున్నారు. విపత్తు స్పందన బృందాలు, ఆర్మీ బలగాలు రంగంలోకి దిగి అత్యాధునిక యంత్రాల సహాయంతో శిథిలాలను తొలగిస్తూ రెస్క్యూ ఆపరేషన్స్ (సహాయక చర్యలు) ప్రారంభించాయి. శిథిలాల లోపలి నుంచి వస్తున్న బాధితుల ఆర్తనాదాలు అక్కడి వారిని కన్నీరు పెట్టిస్తున్నాయి. వీలైనంత ఎక్కువ మందిని ప్రాణాలతో బయటకు తీసేందుకు రక్షణ సిబ్బంది నిరంతరాయంగా శ్రమిస్తున్నారు.

ప్రస్తుతం వెనెజువెలా ప్రభుత్వం చెబుతున్న మరణాల సంఖ్య కేవలం ప్రాథమికం మాత్రమేనని, అసలు విధ్వంసం ఇంకా బయటకు రాలేదని అంతర్జాతీయ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అమెరికా జియోలాజికల్ సర్వే ఈ విపత్తుపై అత్యంత దిగ్భ్రాంతికరమైన, భయానకమైన అంచనాలను విడుదల చేసింది. భూకంపాలు సంభవించిన కేంద్రం, అక్కడి జనాభా సాంద్రత, భవనాల నిర్మాణ శైలిని విశ్లేషించిన యూఎస్‌జీఎస్.. ఈ భూకంపాల వల్ల మరణించిన వారి సంఖ్య కనీసం 10 వేల నుంచి గరిష్టంగా లక్ష వరకు ఉండవచ్చని హెచ్చరించింది. అయితే ఈ ఘోరమైన సంఖ్యలు ప్రాథమిక నమూనా ఆధారంగా అంచనా వేసినవి మాత్రమేనని, పూర్తి వివరాలు తెలియడానికి మరికొన్ని రోజులు పడుతుందని పేర్కొంది.

భూకంపాల ధాటికి ప్రభావిత ప్రాంతాల్లోని మౌలిక సదుపాయాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. విద్యుత్ లైన్లు తెగిపడటం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడంతో రాత్రి వేళల్లో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. టెలిఫోన్ టవర్లు కూలిపోవడం వల్ల సమాచార వ్యవస్థ (కమ్యూనికేషన్ నెట్‌వర్క్) పూర్తిగా స్తంభించిపోయింది. ఎక్కడ ఎవరు చిక్కుకున్నారో తెలుసుకోవడం అధికారులకు కష్టంగా మారింది. మరోవైపు గాయపడిన వందలాది మందితో స్థానిక ఆసుపత్రులు కిక్కిరిసిపోయాయి. మందులు, రక్తం, వైద్య సిబ్బంది కొరత కారణంగా క్షతగాత్రులు సరైన వైద్యం అందక ఆసుపత్రి వరండాల్లోనే అల్లాడిపోతున్నారు.

వెనెజువెలాలో జరిగిన ఈ ఘోర విపత్తుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తక్షణమే స్పందించారు. ప్రకృతి సృష్టించిన ఈ మహా వినాశనంలో పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో వెనెజువెలా ప్రజలను ఆదుకునేందుకు, వారికి అవసరమైన అన్ని రకాల మానవతా సాయాన్ని అందించేందుకు అమెరికా పూర్తి సిద్ధంగా ఉందన్నారు. అమెరికా విదేశీ సహాయ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక విపత్తు సహాయక బృందాన్ని, టాస్క్‌ఫోర్స్‌ను ట్రంప్ ఏర్పాటు చేశారు. శోధన ప్రహరీ కుక్కలు, నిపుణులైన వైద్యులు, అత్యవసర ప్రాణరక్షక మందులు మరియు ఆహార సామగ్రిని తొలి విడతలోనే ప్రత్యేక విమానాల ద్వారా వెనెజువెలా తాత్కాలిక ప్రభుత్వానికి పంపేందుకు శరవేగంగా చర్యలు చేపట్టారు.



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం వెనెజువెలా భూకంప విధ్వంసంపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. "భారతదేశ ప్రజల తరపున వెనెజువెలా తాత్కాలిక ప్రభుత్వానికి, అక్కడి ప్రజలకు నా హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నాను. తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాల బాధను మేము పంచుకుంటున్నాము. గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. ఈ క్లిష్ట సమయంలో భారత్ ఎల్లప్పుడూ వెనెజువెలాకు అండగా నిలుస్తుంది. రెస్క్యూ ఆపరేషన్ల కోసం భారతదేశం తరపున ఎలాంటి సహాయం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

వెనెజువెలాలో సంభవించిన ఈ ఘోర భూకంపాల తీవ్రత ప్రపంచ దేశాలను కదిలించింది. ఇప్పటికే తీవ్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతున్న ఆ దేశానికి ఈ ప్రకృతి వైపరీత్యం ఒక పెద్ద శాపంగా మారిందని ఐక్యరాజ్యసమితి సహా పలు అంతర్జాతీయ మానవతా సంస్థలు ఆవేదన వ్యక్తం చేశాయి. కేవలం అమెరికా, భారత్ మాత్రమే కాకుండా ప్రపంచంలోని మిగిలిన అభివృద్ధి చెందిన దేశాలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వెనెజువెలాకు ఆహారం, తాగునీరు, తాత్కాలిక వసతి గృహాల (టెంట్లు) ఏర్పాటుకు నిధులు, సామగ్రిని సమకూర్చాలని, ఈ విపత్కర సమయంలో మానవత్వాన్ని చాటుకోవాలని అంతర్జాతీయ సమాజం పిలుపునిచ్చింది.

## వేల్పూర్ సాయిబాబా సన్నిధిలో ఘనంగా అన్నప్రాసన, అన్నదానం

**నిజామాబాద్ జిల్లా జూన్25(డీడీ9 వార్త):**

వేల్పూర్ సాయిబాబా దేవాలయంలో గురువారం గురుపూజోత్సవం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సాయినాథునికి ప్రత్యేక పూజలు చేపట్టగా ధ్యాన మందిరంలో భజనలు మారుమోగాయి. గోశాలలో గోపూజ నిర్వహించిన అనంతరం పాకశాలలో అన్నపూజ చేశారు. ఆలయ ప్రాంగణంలో పల్లకి సేవను వైభవంగా నిర్వహించి, ఉపాలయాల్లో నారికేళం సమర్పించారు. ఈ వేడుకల్లో భాగంగా వేల్పూర్‌కు చెందిన రాజారపు అంకితనవీన్ కుమార్ దంపతుల కుమార్తె రాజారపు సహస్ర పుట్టినరోజును పురస్కరించుకుని, అలాగే చంటి లక్ష్మీబాలయ్య దంపతుల కుమారుడు బాలకృష్ణఅక్షయ దంపతుల కుమార్తె చిరంజీవి భాష్వికకు అన్నప్రాసన వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు సాయిబాబాకు వెండి బొట్టు బిళ్ళను బహూకరించి తమ భక్తిని చాటుకున్నారు. కార్యక్రమం అనంతరం అన్నదాతలను ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజారపు సాయిరాం, బాల్‌రాజ్, అబ్బగోని జగదీశ్వర్ గౌడ్, నోముల గంగారెడ్డి, కోరెం నర్సాగౌడ్, దమ్మాయి లక్ష్మి, మహేందర్, కంకణాల రాజేశ్వర్, కండక్టర్ నర్సయ్యతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, సాయి సేవకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఈ నెల 28న పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

**నిజామాబాద్ జిల్లా జూన్25(డీడీ9 వార్త):**

ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ గంగుల సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. భీంగల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారి అజయ్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమంపై నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మరియు భీంగల్ మున్సిపాలిటీ పరిధిలో 0 నుంచి 5 సంవత్సరాల వయసు గల చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ అజయ్ మాట్లాడుతూ... ఆదివారం ఉదయం 7 గంటల నుంచే పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం ప్రారంభమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి సూచించారు. క్షేత్ర స్థాయిలో అందరూ సమన్వయంతో పనిచేసి, అర్హులైన చిన్నారులందరికీ వ్యాక్సిన్ అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై, ఐసీడీఎస్ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, నాయకులు స్వామి, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



## గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి

**ఆదిలాబాద్ జిల్లా తలమడుగు న్యూస్ ( డి డి 9 వార్త ) జూన్ 25**

తలమడుగు మండలం పల్లి బి గ్రామానికి చెందిన భోజన పెల్లి నారాయణ మేకల ఆనంద్ ఆటోలో కూరగాయలు తీసుకొని ఆదిలాబాద్ వెళ్తుండగా మావల హరితహారం వద్ద గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఓ వాహనం బలంగా ఢీకొట్టింది ఈ ప్రమాదంలో మేన ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందగా భోజన పెల్లి నారాయణ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అములుకున్నాయి పోలీస్ అధికారులు ధర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.







## కోటగిరి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ పి.సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా జూన్25(డీడీ9 వార్త):**



పోలీస్ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంచే దిశగా ప్రతి సిబ్బంది నిక్కచ్చిగా విధులు నిర్వహించాలని, ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య స్పష్టం చేశారు. గురువారం ఆయన కోటగిరి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు సంబంధించిన వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల చేదన కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని, ప్రతి కేసులోనూ నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు మేలు చేయాలని సబ్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో వాహనాల రాకపోకలపై నిరంతర నిఘా ఉంచాలని, ముఖ్యంగా ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎన్ఫోర్స్‌మెంట్ పటిష్టం చేయాలని కమిషనర్ సూచించారు. పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల యువతను అప్రమత్తం చేయాలని ఆన్‌లైన్ బెట్టింగ్స్, గేమ్స్ పట్ల ఆకర్షితులై ఆర్థికంగా చితికిపోతున్న వారిని చైతన్యపరిచేందుకు పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో విలేజ్ పోలీస్ అధికారులు ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసు సిబ్బంది 24 గంటల పాటు హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని, ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలని, విధి నిర్వహణలోనూ వ్యక్తిగత ప్రయాణాల్లోనూ హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ తనిఖీల్లో బోధన్ ఏసీపీ పి.శ్రీనివాస్, రుద్రూర్ సీఐ కృష్ణ, కోటగిరి ఎస్ఐ జి.శ్రీనివాస్ యాదవ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## స్వర్ణకారుల కష్టాలను తీర్చాలి : బోధన్ ఆర్డీఓకు వినతి

**బోధన్, నిజామాబాద్ జూన్25(డీడీ9 వార్త):**

పెరుగుతున్న బంగారం ధరలతో ఉపాధి కరువై ఇబ్బందులు పడుతున్న స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలని బోధన్ పట్టణ స్వర్ణకారుల సంఘం కోరింది. గురువారం సంఘం నాయకులు బోధన్ ఆర్డీఓ విజయకుమారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ధరల పెరుగుదల వల్ల తమ సాంప్రదాయ వృత్తిపై ఆధారపడిన కుటుంబాల జీవనం భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రత్యేక పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బొప్పాపురం హనుమాన్లు చారి, కార్యదర్శి త్రివేణి నాగరాజు, కోశాధికారి మల్లేశ్వరం నారాయణ చారి, నాయకులు లింగోజు నరేంద్ర చారి, కే. బాలాజీ చారి, భాస్కర్ చారి, వెంకటేశం చారి, కే. సత్యనారాయణ చారి, ఎం. నరేష్ చారి, కే. రమేష్ చారి, ఏ. బాలరాజు చారి, శేఖర్ చారి, ఎస్. శంకర్ చారి తదితరులు పాల్గొన్నారు.



## సకాలంలో ఓటర్ ఎన్యుమరేషన్ ఫారాలు పూరించి అందజేయాలి : బోధన్ తహసీల్దార్

**బోధన్, నిజామాబాద్ జూన్25(డీడీ9 వార్త):**

ఓటర్ల జాబితా సవరణలో భాగంగా, భారత ఎన్నికల సంఘం, రాష్ట్ర సిఇఓ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బోధన్ పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఓటర్ ఎన్యుమరేషన్ ప్రక్రియను గురువారం నుండి అధికారికంగా ప్రారంభించినట్లు బోధన్ తహసీల్దార్ విట్టల్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓటర్లందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఇంటింటికీ వచ్చే బి.ఎల్.ఓల ద్వారా ఫారాలను సకాలంలో పొందాలని ఆయన కోరారు. ఈ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరుకు రెండు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తామని, వారం రోజుల తర్వాత బి.ఎల్.ఓలు తిరిగి వచ్చి వాటిని సేకరిస్తారని తహసీల్దార్ వివరించారు. ఓటర్లు ఆ ఫారాలలో తమ వివరాలను పూర్తి చేసి సిద్ధంగా ఉంచుకోవాలని, మ్యాపింగ్ కాని వారు ఫారాల వెనుక పేర్కొన్న 11 రకాల డాక్యుమెంట్లలో ఏదో ఒక దానిని జతచేసి బి.ఎల్.ఓలకు అందించాలని సూచించారు. 2002 ఓటర్ల జాబితాలో లేని వారు కూడా ఈ నిబంధనను పాటించి డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫారాల పంపిణీ ప్రక్రియను రాబోయే నాలుగు నుండి ఐదు రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, జూన్ 25 నుండి జూలై 24 వరకు పంపిణీ మరియు సేకరణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఓటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే బి.ఎల్.ఓలను, సూపర్వైజర్లను, తహసీల్దార్ కార్యాలయాన్ని లేదా హెల్ప్ డెస్కును సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చని ప్రజల సందేహాలను తీర్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తహసీల్దార్ పేర్కొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి.

- **లేదంటే ఐ&పీఆర్ కమిషనరేట్ ముట్టడి: కాదేపురం గంగన్న**

**కామారెడ్డి, జూన్ 25(డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం దళిత, గిరిజన జర్నలిస్టులంతా ఏకం కావాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న పిలుపునిచ్చారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో సామాజిక వివక్ష కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. అక్రిడిటేషన్ కమిటీలలో దళిత, గిరిజన జర్నలిస్టులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.

2024 వరకు జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగిసి సంవత్సరం దాటినా కొత్త కార్డుల జారీ విషయంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆయన విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టుల పిల్లలకు పాఠశాలలు, కళాశాలల్లో ప్రస్తుతం ఉన్న 50 శాతం రాయితీకి బదులుగా 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు.ఈనెల 28వ తేదీ లోపు ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేదంటే జూన్ 29న హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్, ఏసీ గార్డ్స్ ప్రాంతంలో ఉన్న ఐ&పీఆర్ కమిషనర్ కార్యాలయాన్ని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు.రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు దళిత, గిరిజన జర్నలిస్టులకు అన్యాయం కొనసాగుతోందని గంగన్న ఆవేదన వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు సముచిత స్థానం కల్పించినప్పుడే వారికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే సంక్షేమ పథకాల అమలులో కూడా దళిత, గిరిజన జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ ముట్టడి కార్యక్రమానికి దళిత, గిరిజన జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, సామాజిక న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరై ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు తెడ్డు సాయిలు, జిల్లా అధ్యక్షులు కుంటొల్ల యాదయ్య, జాయింట్ సెక్రెటరీ పెరుమాళ్ల రాజు, కిసరి రాజు, జిల్లా సలహాదారులు బి. సాయిలు, రవి నాయక్, రాజలింగం, రవి తదితరులు పాల్గొన్నారు.







# డ్రగ్స్, సోషల్ మీడియాకు బానిస కావద్దు

- **మత్తుకు దూరంగా ఉండి లక్ష్య సాధనపై దృష్టి పెట్టండి**
- **చాటింగ్ కాదు.. చదువే ముఖ్యం**
- **విద్యార్థులకు ఏసీపీ మడత రమేష్ పిలుపు**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 25 (డీడీ9 వార్త):**

మాదక ద్రవ్యాలకు బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని, సోషల్ మీడియా మాయలో పడి భవిష్యత్తును పణంగా పెట్టొద్దని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. గోదావరిఖని ఉప్పర సంఘం కార్యాలయంలో గురువారం ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని యువతకు పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీసీపీ రాంరెడ్డి, ఏసీపీ మడత రమేష్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, సామాజికంగా ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించారు.

**ఒక్కసారి అలవాటు అయితే బయటపడటం కష్టం**

ఈ సందర్భంగా ఏసీపీ మడత రమేష్ మాట్లాడుతూ..., యువతలో కొందరు సరదా కోసం లేదా స్నేహితుల ప్రభావంతో డ్రగ్స్ వైపు ఆకర్షితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలకు ఒక్కసారి అలవాటు పడితే వాటి నుంచి బయటపడటం చాలా కష్టమని, అవి ఆరోగ్యాన్ని, చదువును, భవిష్యత్తును పూర్తిగా దెబ్బతీస్తాయని హెచ్చరించారు.

**సోషల్ మీడియా మోజులో సమయాన్ని వృథా చేయొద్దు**

ప్రస్తుత కాలంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా వేదికలు విద్యార్థుల విలువైన సమయాన్ని హరించేస్తున్నాయని పేర్కొన్నారు. గంటల తరబడి చాటింగ్‌లు, రీల్స్, షార్ట్ వీడియోలతో కాలం గడపకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. మొబైల్ ఫోన్‌కు బానిసలుగా కాకుండా, దానిని అవసరమైన మేరకు మాత్రమే వినియోగించాలని చెప్పారు.

**తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించాలి**

విద్యార్థుల చదువు కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలని ఏసీపీ సూచించారు. వారి ఆశలను, కలలను నిజం చేసేలా కష్టపడి చదవాలని, మంచి మార్కులు సాధించి కుటుంబానికి గర్వకారణంగా నిలవాలని అన్నారు. తల్లిదండ్రులు తలెత్తుకునే విధంగా ప్రవర్తించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొన్నారు. చట్టానికి విరుద్ధమైన పనులకు దూరంగా ఉండాలని, చిన్న తప్పిదం కూడా జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన పరిస్థితులు ఎప్పుడూ రాకుండా క్రమశిక్షణతో జీవించాలని సూచించారు. చెడు స్నేహాలు, చెడు అలవాట్లు, అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు.

**యువత దేశానికి వెన్నెముక**

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత దేశానికి వెన్నెముకలాంటిదని ఏసీపీ మడత రమేష్ అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని, తల్లిదండ్రులకు, విద్యాసంస్థలకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి తన జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదల, అంకిత భావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 1 టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు మనోహర్ అనూష, కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల చైర్మన్ డాక్టర్ రవికుమార్ నాగండ్ల, కళాశాల ప్రిన్సిపాళ్లు,అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండి సమాజంలో ఆదర్శప్రాయమైన పౌరులుగా ఎదగాలని ప్రతిజ్ఞ చేశారు.






## అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ వెలుగులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్25(డీడీ9 వార్త):**

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యుత్ సౌకర్యం లేని అంగన్వాడీ కేంద్రాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు కల్పిస్తోంది. బోధన్ డివిజన్‌లో మొదటి విడతలో 129 కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించగా సిఎండి వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు రెండో విడతలో మరో 78 కేంద్రాలకు ఉచిత విద్యుత్ మీటర్లను అమర్చే ప్రక్రియను విద్యుత్ శాఖ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడిఈ తోట రాజశేఖర్ మాట్లాడుతూ...ప్రభుత్వ భవనాలతో పాటు అద్దె లేని భవనాల్లో నడుస్తున్న కేంద్రాలకు సైతం ఈ కనెక్షన్లను అందిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల చిన్నారులకు ఉక్కపోత నుండి ఉపశమనం లభించనుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం ఎడపల్లి మండలంలోని ఎంఎస్సీ ఫారం అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ నోముల జయశ్రీ శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో నూతన విద్యుత్ మీటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...అంగన్వాడీ కేంద్రాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ కిషోర్, అంగన్వాడీ టీచర్ సుప్రియ, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చెక్ పవర్ రద్దును నిలిపివేయాలి

- **హైదరాబాద్‌లో ఉప సర్పంచుల నిరసన**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్25(డీడీ9 వార్త):**

ఉప సర్పంచుల చెక్ పవర్ రద్దు యోచనను వెంటనే విరమించుకోవాలని, చట్టబద్ధమైన తమ హక్కులను కాపాడాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఉప సర్పంచులు నిరసన చేపట్టారు. ఎడపల్లి, బోధన్, సాలూర తదితర మండలాల నుండి తరలివెళ్లిన ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ... 2018 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం దక్కిన అధికారాలను కాలరాయడం సరికాదని, అధికారుల తప్పుడు సలహాలతో ప్రభుత్వం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. తమకు గౌరవ వేతనం చెల్లించాలని, గ్రామ పంచాయతీ తీర్మానాల్లో ఉప సర్పంచ్ సంతకాన్ని తప్పనిసరి చేయాలని అభివృద్ధి పనుల శిలాఫలకాలపై ఉప సర్పంచ్ పేరును నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పష్టత ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.



## బర్దిపూర్ లో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ ప్రారంభం

**బోధన్, నిజామాబాద్ జూన్25(డీడీ9 వార్త):**

ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా బోధన్ మండలంలోని బర్దిపూర్ గ్రామంలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను గురువారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ, క్షేత్రస్థాయిలో మ్యాపింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బర్దిపూర్ గ్రామంలోని 13వ పోలింగ్ బూత్ పరిధిలో ఇంటింటికీ తిరిగి, ఓటర్లకు అవసరమైన ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, సమగ్రంగా రూపొందించే ఉద్దేశంతోనే ఈ మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టినట్లు వారు వెల్లడించారు. ఈ ప్రక్రియలో ఓటర్లందరూ తమ వివరాలను సరిచూసుకోవాలని, మ్యాపింగ్ ప్రక్రియ విజయవంతానికి సహకరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ హనుమాండ్లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం : ఎస్ఐ రమాదేవి

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్25(డీడీ9 వార్త):**

మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా ఎడపల్లి ఎస్ఐ ముత్యాల రమాదేవి ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణ నుండి ఛత్రపతి శివాజీ విగ్రహం వరకు సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యతిరేక నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. డ్రగ్స్ బారిన పడి యువత ప్రాణాలు కోల్పోవద్దని, ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విద్యార్థులు ప్లకార్డుల ద్వారా సందేశమిచ్చారు. ర్యాలీ అనంతరం శివాజీ విగ్రహం వద్ద ఎస్ఐ రమాదేవి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డ్రగ్స్ అనే మహమ్మారికి దూరంగా ఉంటూ చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. యువత చైతన్యవంతంగా ఉంటేనే దేశ భవిష్యత్తు బాగుంటుందని, ఏదైనా అనుమానాస్పద అంశాలు గమనిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా, సామాజిక బాధ్యతతో మెలగాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా!!

- **పారదర్శకంగా ఎస్ఐఆర్-2026 అమలు చేయాలి**
- **ఇంటింటి సర్వేతో పకడ్బందీగా ఓటరు జాబితా**
- **అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం**
- **రామగుండం మేయర్ మహంకాళి స్వామి**
- **మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ**

**పెద్దపల్లి బ్యూరో , జూన్ 25 (డీడీ 9 వార్త):**

రామగుండంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్2026 పై అధికారులు సమీక్ష నిర్వహించారు. గురువారం ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు కీలక సూచనలు చేశారు మేయర్, మున్సిపల్ కమిషనర్. ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ..., ఎస్ఐఆర్2026 అనేది చాలా ముఖ్యమైన కార్యక్రమం. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనది. 18 ఏళ్లు నిండిన ఒక్క అర్హుడి పేరు కూడా ఓటరు జాబితాలో మిస్ కాకూడదు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి, బాధ్యతగా సర్వే చేయాలి. ఎలాంటి పొరపాట్లకు, రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా పారదర్శకంగా పని చేయాలి. డూప్లికేట్ ఓట్లు, చనిపోయిన వారి పేర్లు తొలగించాలి. ఇది మనందరి బాధ్యత అని తెలిపారు మేయర్. అనంతరం అడిషనల్ కలెక్టర్, రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ మాట్లాడుతూ, ఎస్ఐఆర్2026 షెడ్యూల్‌ను ప్రతి ఒక్క బీఎల్‌వో కచ్చితంగా పాటించాలి. కొత్త ఓటరు నమోదు, చిరునామా మార్పులు, తొలగింపులకు సంబంధించి వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి. ఫారం6, ఫారం7, ఫారం8 దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా సకాలంలో పరిష్కరించాలి. డూప్లికేట్ ఎంట్రీలు, లాజికల్ ఎర్రర్లను రోజువారీగా సరిచేయాలి. టెక్నాలజీని పూర్తిగా వాడుకుంటూ, గరుడ యాప్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలి. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎల్లయ్య, రామగుండం తహశీల్దార్ రవీందర్ రావు,



రెవెన్యూ, ఎన్నికల విభాగం సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




# సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ఖాకీ యూనిఫాం ఇవ్వాలి

- **ఏఐటీయూసీ డిమాండ్**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 25 (డీడీ9 వార్త):**

సింగరేణి ఆర్జీ1 పరిధిలో పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు వెంటనే ఖాకీ యూనిఫాం అందజేయాలని ఏఐటీయూసీ రామగుండం నగర సమితి డిమాండ్ చేసింది. గురువారం ఆర్జీ1 జీఎం కార్యాలయంలో ఎస్‌వోటు జీఎం కే. చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు అబ్దుల్ కరీం, ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఖాకీ యూనిఫాంలతో పాటు లాఠీలు, టార్చ్‌లైట్లు, రేన్ కోట్లు, నైట్ అలవెన్స్, డస్ట్ అలవెన్స్, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు. సెక్యూరిటీ గార్డులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో వారి భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని, న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్జీ1 జీఎం కార్యాలయాన్ని దిగ్బంధనం చేస్తామని హెచ్చరించారు.



# కౌన్సిలర్ భరత్ కు ఆహ్వానం పత్రికను అందజేసిన టిఆర్పి నాయకులు

- **తెలంగాణ రాజ్యాధికార పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు దిలీప్ కుమార్**

**డీ డీ 9 వార్త, ములుగు :**

భువనగిరిలో జూలై 5వ తేదీన నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి సభకు గోనెల భరత్ ములుగు మున్సిపాలిటీ కౌన్సిలర్ గారిని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి గట్ల రాజన్న, ములుగు జిల్లా అధ్యక్షులు తవిటి దిలిప్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కోరే రవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోరిక సునీత, జిల్లా ఉపాధ్యక్షురాలు శీలవంతుల సునీత, జిల్లా ఉపాధ్యక్షురాలు మొగిలిపల్లి వినోద, యువజన విభాగం నాయకులు గట్ల వినీత్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ విజయ్ తదితరులు పాల్గొని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మైనారిటీ, మహిళ రాజ్యాధికార సాధన లక్ష్యంగా నిర్వహిస్తున్న రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేయాలని దిలీప్ కుమార్ పిలుపునిచ్చారు.

# వర్షా కాలానికి ముందస్తు చర్యలు.

- **డ్రైనేజీ కాలువల శుభ్రతకు శ్రీకారం చుట్టిన సర్పంచ్ భూక్య సుమలత**

**గోవిందరావుపేట,జూన్ 25( డి డి 9 వార్త)**

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామంలో నీటి నిల్వలు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతూ పసర గ్రామ సర్పంచ్ భూక్య సుమలత ఆధ్వర్యంలో డ్రైనేజీ కాలువలు శుభ్రపరిచే పనులు చేపట్టారు. గ్రామంలోని 11వ వార్డుతో పాటు ఇతర వార్డులలో జేసీబీ సహాయంతో డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను తొలగించి నీటి పారుదల సాఫీగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ సుమలత మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కాలువలు మూసుకుపోవడం వల్ల నీరు నిల్వ ఉండి దోమలు, వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ముందుగానే శుభ్రత పనులు చేపడుతున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీష్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొని పనులను పర్యవేక్షించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు ప్రజలు కూడా సహకరించాలని అధికారులు కోరారు.



# మునిసిపల్ వైస్ చైర్మన్ ను ఆహ్వానించిన టిఆర్పి నాయకులు

- **భువనగిరి సమరభేరిని విజయవంతం చేయాలి**
- **తెలంగాణ రాజ్యాధికార పార్టీ – ములుగు* జిల్లా అధ్యక్షులు దిలీప్ కుమార్**

**డిడి 9 వార్త, ములుగు :**

భువనగిరిలో జూలై 5వ తేదీన నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి సభకు హాస్య షాహిన్ రిహాజ్ మీర్జా ములుగు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గారిని తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి గట్ల రాజన్న, ములుగు జిల్లా అధ్యక్షులు తవిటి దిలిప్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కోరే రవి, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోరిక సునీత, జిల్లా ఉపాధ్యక్షురాలు శీలవంతుల సునీత, జిల్లా ఉపాధ్యక్షురాలు మొగిలిపల్లి వినోద, యువజన విభాగం నాయకులు గట్ల వినీత్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ విజయ్ తదితరులు పాల్గొని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మైనారిటీ, మహిళ రాజ్యాధికార సాధన లక్ష్యంగా నిర్వహిస్తున్న రాజ్యాధికార సమరభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం!!

- **యువత మేల్కొనండి... డ్రగ్స్ తరిమికొట్టండి**
- **విద్యార్థుల ప్రతిజ్ఞ, పోలీస్ సిబ్బంది మద్దతు**
- **తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా పెట్టాలి**
- **2టౌన్ ఎస్.హెచ్.ఓ. ఎన్. ప్రసాదరావు**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 25 (డీడీ9 వార్త):**

యాంటీ డ్రగ్స్ వీక్ సందర్భంగా గోదావరిఖని టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఎన్. ప్రసాదరావు ఆధ్వర్యంలో 8 ఇంక్లైన్ కాలనీలోని తెలంగాణ చౌరస్తాలో గురువారం ఒక వినూత్న చైతన్య కార్యక్రమం జరిగింది. స్థానిక స్పందన హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులతో కలిసి నిర్వహించిన ఈ భారీ మానవహారం సమాజానికి ఒక బలమైన సందేశాన్ని ఇచ్చింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ..., నేటి యువత తెలియకుండానే సిగరెట్ స్మోకింగ్, గంజాయి వంటి ప్రాణాంతక మత్తు పదార్థాల బారిన పడి తమ విలువైన భవిష్యత్తును చీకట్లోకి నెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "యువత మేల్కొనండి... డ్రగ్స్ ను తరిమికొట్టండి" అంటూ ఆయన ఇచ్చిన పిలుపు అక్కడ చేరిన ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. ముఖ్యంగా, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై, వారి తిరుగులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, చెడు మార్గాల వైపు వెళ్లకుండా వారిని సన్మార్గంలో ప్రోత్సహించాల్సిన బాధ్యత కుటుంబాలపైనే ఉందనే నిజాన్ని ఆయన చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో సంకల్పించిన ఈ మహా యజ్ఞంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని, మహమ్మారిలా మారుతున్న మాదకద్రవ్యాలను వేళ్లతో సహా నిర్మూలించాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే పాఠశాల విద్యార్థులందరితో డ్రగ్స్ నిరోధక ప్రతిజ్ఞ చేయించి, వారిలో సామాజిక బాధ్యతను నింపారు. సమాజంలో ఎక్కడైనా ఎవరైనా డ్రగ్స్ సేవించినా లేదా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే, వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా కంట్రోల్ రూమ్ నెంబర్ 8712671111 కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న వ్యసనాలపై సమరం ప్రకటించిన ఈ చైతన్యవంతమైన కార్యక్రమంలో గోదావరిఖని టూ టౌన్ పోలీస్ సిబ్బంది సిహెచ్. రాజయ్య, విశ్వనాథ్, ప్రదీప్ రెడ్డి, అఫ్రోజ్, దేవేందర్ రావు, విజయమణిలతో పాటు స్పందన స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.




# నకిలీ విత్తనాల విక్రయాలపై నిఘా

- **అమ్మితే పీడీ యాక్ట్**
- **షాపులు సీజ్ హెచ్చరిక**
- **మేడారం నార్లపూర్ పోలీస్ స్టేషన్ ఎస్సై అచ్చ కమలాకర్**

**తాడ్వాయి మండలం జూన్ 25 (డిడి9 వార్త)**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం వివిధ గ్రామాల ప్రజలకు విజ్ఞప్తిచేస్తున్నాను వానాకాల సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో నకిలీ బ్రోకర్ విషయాలు నమ్మకండి రైతులు నకిలీ విత్తనాలు, ఎరువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు రైతులకు అవగాహన కల్పిస్తూ ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, సంబంధిత లైసెన్సులు రద్దు చేయడంతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, బ్యాచ్ నంబర్‌తో పాటు రైతు వివరాలు నమోదు చేయించుకోవాలని



సూచించారు.

గ్రామాల్లో అపరిచితులు సంచరిస్తూ నకిలీ విత్తనాలు విక్రయించే ప్రయత్నాలు చేస్తే వెంటనే పోలీసులకు లేదా వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. నకిలీ విత్తనాలు, ఎరువుల రవాణా మరియు విక్రయాలపై పోలీసు శాఖ నిరంతర నిఘా కొనసాగిస్తోందని తెలిపారు.



# జీఎం వై. రఘు రామిరెడ్డికి ఘన వీడ్కోలు

- **38 ఏళ్ల సుదీర్ఘ సేవలకు గాను ఆత్మీయ సన్మానం**
- **ఏరియా-1 జీఎం కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 25 (డీడీ9 వార్త):**

సింగరేణి రామగుండం ఏరియా 1 జనరల్ మేనేజర్ వై. రఘు రామిరెడ్డికి గురువారం ఏరియా 1 జీఎం కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఎస్.ఓ .టు.జీఎం చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏరియాలోని వివిధ గనులు, విభాగాల అధిపతులు పాల్గొని రఘు రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ, 1988 జనవరి నుంచి 38 సంవత్సరాలకు పైగా సింగరేణి సంస్థలో వివిధ ఏరియాలు, గనులు, విభాగాలతో పాటు ముఖ్యంగా ఎస్‌ఏపీ విభాగంలో వివిధ హోదాల్లో విధేయత, అంకితభావంతో సేవలందించిన రఘు రామిరెడ్డి సేవలు అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్లు, ప్రాజెక్టు ఆఫీసర్ చిలక శ్రీనివాస్, డి. రమేష్, ఏరియా ఇంజినీర్ జి.వి. రాజాజీ, ఏరియా 1 పరిధిలోని అన్ని గనులు, విభాగాల అధిపతులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎక్లాస్‌పూర్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం

- **లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ జూపాక మమత-శ్రీనివాస్**

**పెద్దపల్లి బ్యూరో, జూన్ 25 (డీడీ9 వార్త):**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎక్లాస్‌పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు నిర్మించిన ఇంటిలో లబ్ధిదారులు గుమ్మడి వెంకన్న, విజయలక్ష్మి కుటుంబ సభ్యులు సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి గృహ ప్రవేశం చేశారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జూపాక మమతశ్రీనివాస్ నూతన గృహంలోకి ప్రవేశించిన కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

సర్పంచ్ మమతశ్రీనివాస్ మాట్లాడుతూ..., ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం అనేక కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతోందని అన్నారు.

లబ్ధిదారులు మాట్లాడుతూ... తమ సొంత ఇంటి కల నెరవేరిందని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లగిశేటి రాకేష్, బరుపాటి తిరుపతి, ముఖ్య నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువతే కీలకం.

- **సెయింట్ మేరీస్ హై స్కూల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు**

**గోవిందరావుపేట,జూన్ 25(డిడి 9 వార్త)**

మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప రిణామాలపై విద్యార్థులు, యువతలో చైతన్యం కల్పించే లక్ష్యంతో పసర పోలీస్ స్టేషన్ ఆధ్వర్యం లో గురువారం సెయింట్ మేరీస్ హై స్కూల్‌లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించా రు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ రవీందర్ సూచ నలతో, పసర సీఐ దయాకర్ పర్యవేక్షణలో ఎస్ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం పాఠశాల గోడలపై డ్రగ్స్ వ్యతిరేక సందేశాలతో వాల్ పోస్టర్లు అంటించి, వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి బారిన పడితే వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని పోలీసు అధికారులు వివరించారు. ఎస్ఐ తాజుద్దీన్ మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వి ద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి సారించి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చా రు.పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, ఈ అవగాహన సదస్సు విద్యార్థుల్లో మాదక ద్రవ్యాల పట్ల చైతన్యం పెంపొందించడంలో ఎంతో ఉప యోగకరంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల కరస్పాండెంట్లు పెంటా రెడ్డి, స్టీఫెన్ రెడ్డి, ప్రిన్సిపాల్ వేణు, ఉపాధ్యాయురాలు సుప్రియా, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# సింగరేణిలో కొవ్వొత్తుల్లా కరిగిపోతున్న కాంట్రాక్ట్ కార్మికుల బతుకులు..

- **ఎవరికోసం ఈ బొగ్గు, ఎవరి కడుపు నింపుతోంది ఈ నల్ల బంగారం..**
- **ఐ ఎఫ్ టి యు మణుగూరు ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అంగోత్ మంగీలాల్ ఆవేదన..**

**మణుగూరు.జూన్ 25(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు సింగరేణి. "ఎవరి కోసం ఈ బొగ్గు? ఎవరి కడుపు నింపుతోంది ఈ నల్లబంగారం?" అని ఐ ఎఫ్ టి యు మణుగూరు ఏరియా కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షులు అంగోత్ మంగీలాల్ ఆవేదన వ్యక్తం చేశారు.సింగరేణి కంపెనీ లిమిటెడ్‌లో చెమటో డ్చి బొగ్గు ఉత్పత్తిలో భాగస్వాములమైన కాంట్రా క్ట్ కార్మికులం మేము. తెలంగాణకు వెలుగులు పంచడంలో మేము భాగస్వాములమైనా, మా బతుకుల్లో మాత్రం చీకటే మిగిలిందని ఆయన అన్నారు.

**మా అర్ధాకలి గోడు వినండి:**

చట్టాలు ఉన్నవారికి చుట్టాలవుతున్నాయి: కార్మిక చట్టాలు పుస్తకాలకే పరిమితమయ్యాయి. కాంట్రాక్టర్‌కు, అధికారికి చుట్టమై, మాకు మాత్రం శత్రువులవుతున్నాయి. హై పవర్ కమిటీ లేదు, ESI, లేదు, ఉద్యోగ భద్రత లేదు. బయట ప్రమాదవశాత్తును, అనారోగ్యంతో చనిపోతే కనీసం బీమా కూడా అమలు కానీ పరి స్థితి. దీనితో కుటుంబాలు అనాధలవుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలో బానిస బతుకులు: ఇది ప్రభుత్వ సంస్థ అయినా, ఇక్కడ మేము 21వ శతాబ్దపు బానిసలం. సరైన దుస్తులు లేవు, కడు పునిండా కూడు లేదు, తలదాచుకునే గూడు లేదు. "కాంట్రాక్ట్" అనే సంకెళ్లతో బంధీలమై బతుకుతున్నాం. అసంఘటితులమని కనికరం లేదా?: మేము యూనియన్లలో లేము, మాకు గొంతు లేదు అని మా శ్రమను దోచుకుంటారా? ప్రభుత్వమే మమ్మల్ని గాలికి వదిలేస్తే, ఇక మాకు దిక్కెవరు?

**మా డిమాండ్లు - ఇవి బిచ్చం కాదు, మా హక్కు:**

సమాన పనికి సమాన వేతనం: రెగ్యులర్ కార్మి కుడితో సమానంగా కాకపోయినా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి: "కాం ట్రాక్ట్" పేరుతో మా జీవితాలతో ఆడుకోవడం ఆపాలి. పని ఉన్నంత కాలం ఉద్యోగ భద్రత ఇవ్వాలి. మానవీయంగా బతికే హక్కు: గౌరవ ప్రదమైన వేతనం, నివసించడానికి ఇల్లు, వైద్య సౌకర్యం, మా పిల్లలకు చదువు కావాలి. మేము యంత్రాలం కాదు, మనుషులం.



**ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి ఒకే మాట:**

బొగ్గు నల్లగా ఉంటుంది కానీ మా బతుకులు మసి చేయకండి. మీ లాభాల లెక్కల్లో మా కన్నీటి చుక్కలను కూడా లెక్కించండి. చట్టాలు అందరికీ సమానం అయినప్పుడే అవి చట్టాలు అవుతాయి. లేకపోతే అవి అధికారం చుట్టూ తిరిగే చుట్టాలు మాత్రమే. "శ్రమ దోపిడీ ఆగాలి. కాంట్రాక్ట్ బానిసత్వం పోవాలి. శ్రామిక వర్గం బతుకులు మారాలి. ఇది హెచ్చరిక కాదు, ఆకలితో ఉన్న కడుపుల ఆక్రందన" అని అంగోత్ మంగీలాల్ ఆవేదన వ్యక్తం చేశారు.





# భద్రాచలంలో 'పల్లవి కిడ్స్' పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్ల వెంకటరావు

- **నాణ్యమైన విద్యే సమాజ నిర్మాణానికి పునాది: ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**భద్రాచలం, జూన్ 25 డిడి9 వార్త**

భద్రాచలం పట్టణంలో విద్యారంగంలో కొత్త అధ్యాయం మొదలైంది. జీసిసి రోడ్డులోని దేవరాజ్ హాస్పిటల్ సమీపంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన 'పల్లవి కిడ్స్' స్కూల్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాచలం మేజర్ గ్రామపంచా యతీ సర్పంచ్ పూనెం కృష్ణ, దేవస్థానం ఏఈఓ శ్రవణ్ కుమార్ కలిసి రిబ్బన్ కట్ చేసి పాఠశా లను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంక ట్రావు మాట్లాడుతూ.. బాల్య దశలో అందించే నాణ్యమైన విద్యే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని అన్నారు. కేవలం పుస్తక పరి జ్ఞానానికే పరిమితం కాకుండా, చిన్నారులలో సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను పెం పొందించేలా విద్యాసంస్థలు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలని, క్రీడలు, కళా రంగాల్లోనూ ప్రోత్సహించాలని పేర్కొన్నా రు. సర్పంచ్ పూనెం కృష్ణ మాట్లాడుతూ, చిన్నా రులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిం చేందుకు ఇటువంటి విద్యాసంస్థలు రావడం అభినందనీయమని అన్నారు. ఏఈఓ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే పిల్ల ల్లో నైతిక విలువలు, దేశభక్తిని పెంపొందించా ల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రారంభోత్స వం అనంతరం అతిథులు పాఠశాలలోని స్మార్ట్ లెర్నింగ్ సదుపాయాలు, తరగతి గదులను పరి శీలించారు. పాఠశాల యాజమాన్యం అనుసరి స్తున్న బోధనా పద్ధతులపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమా న్యం వీరరాపు వెంకట సంపూర్ణ రావు, బొప్పిడి పూజ, కవిటాపు రమేష్, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా అతిథులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది.




# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- **ప్రతి ఒక్క విద్యార్థి డ్రగ్స్ రహిత సైనికుడిగా పనిచేయాలి**
- **నార్లాపూర్ ఎస్ఐ అచ్చ కమలాకర్**

**తాడ్వాయి మండలం జూన్ 25 (డిడి9 వార్త)**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం డ్రగ్స్ కి విద్యార్థులు యువత దూరంగా ఉండాలని మేడారం ఎస్ఐ కమలాకర్ పిలుపునిచ్చారు, ఈరోజు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఊరట్టం, బయ్యక్కపేట, ఆశ్రమ పాఠశాలలను, సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి ఎస్ఐ కమలాకర్ మాట్లాడుతూ, వి ద్యార్థులు యువత, ఆరోగ్యకరమైన, జీవన విధా నాన్ని అలవర్చుకోవాలంటే, డ్రగ్స్ కి దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల నిర్మూలనకు, ప్రతి ఒక్క విద్యార్థి సైనికుడిగా పనిచేయాలని, ఒక్కసారి ముందుకు అలవాటు అయితే బయ టపడటం కష్టం చట్టానికి విరుద్ధమైన పనులు చేయకూడదు విద్యార్థులకు చదువే ముఖ్యం చదువుపై దృష్టి సాధించాలని సూచించారు మీ ఆశలను మీ కలలను నిజము చేసేలా కష్టపడి చదవాలని మంచి మార్కులు సాధించి కుటుం బానికి గర్వకారణంగా నిలవాలని అన్నారు వివిధ పాఠశాలల, విద్యార్థులతో, ప్రతిజ్ఞ చేయించారు, ఈ కార్యక్రమంలో, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, గ్రామ స్తులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు ,




# మేడారంలో వివాహానికి హాజరైనా నూతన వధూ వరులను ఆశీర్వదించిన రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క

**తాడ్వాయి మండలం జూన్ 25 (డిడి9 వార్త)**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం , మేడారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, సమ్మక్క తల్లి ప్రధాన పూజారి సిద్దబోయిన సుగుణ మునేందర్ కుమారుడు సిద్దబోయిన సందీప్ వివాహానికి హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించిన రాష్ట్ర మంత్రీ వర్యులు సీతక్క ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్ , వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి , సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చర్ప రవీందర్ , వార్డ్ మెంబర్ సభ్యులు సిద్ధబోయిన జనార్ధన్ , కృష్ణ , మండల నాయకులు అనుమాండ్ల రాజీ రెడ్డి , ఆలేటి జైపాల్ రెడ్డి , ఎనగందుల బాపు రెడ్డి , సంఘం రాము , సోషల్ మీడియా టీం , కార్యకర్తలు ప్రధాన పూజారి సిద్ధబోయిన జగ్గారావు తదితరులు పాల్గొన్నారు





# గురువారం నాడు పలు వివాహ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..

- **నూతన దంపతుల వైవాహిక జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షించారు.**

**మణుగూరు.జూన్ 25(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లోని కమలాపురం గ్రామానికి చెందిన కంపెల్ల సుబ్బయ్య చంద్రావతి దంపతుల కుమారుడు రాధాకృష్ణ మరియు సంజన ల వివాహ మహోత్సవానికి పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెం కటేశ్వర్లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.అనంతరం అదే గ్రామా నికి చెందిన గుమ్మల దామోదర్ ప్రమీల దంపతుల కుమారుడు శివసాయి మరియు దేవిశ్రీ ల వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సంద ర్భంగా పాయం వెంకటేశ్వర్లు మాట్లాడు తూ.. నూతన దంపతుల వైవాహిక జీవితం ఆనందమయం కావాలని,ఆయురారోగ్యా లతో,సుఖసంతోషాలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా పలకరించి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు,కుటుంబసభ్యులు,బంధుమిత్రులు ,అభిమానులు పాల్గొన్నారు.

# MSR హాస్పిటల్ మల్టీస్పెషాలిటీ కేర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

- **గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచన.**

**మణుగూరు.జూన్ 25 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం, అంబేద్కర్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన MSR హాస్పి టల్ మల్టీస్పెషాలిటీ కేర్ ప్రారంభోత్సవ కా ర్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెం కటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రిని ప్రారంభించి, వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం సంతోషకరమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నా రు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఇటువంటి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.అనంతరం ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించి, ఆసుపత్రి ద్వారా ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అం దించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పం చులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, 14 టైర్ యూనియన్ నాయకులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.



# ప్రతి చిన్నారికి రెండు చుక్కలే రక్షణ...

- **జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..**
- **మండల స్థాయి సమన్వయ సమావేశంలో ఎంపీడీఓ బొగ్గ నారాయణ..**

**జూన్25 డిడి9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురం, జూన్ 25: జూన్ 28, 2026న నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) బొగ్గ నారాయణ పిలు పునిచ్చారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణపై మండల స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, మండలంలోని 0 నుంచి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. ఇందుకోసం మండల వ్యాప్తంగా 70 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రజలు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

"పోలియో రహిత భారత్ మన లక్ష్యం - ప్రతి చిన్నారికి రెండు పోలియో చుక్కలు వేయించడం మనందరి బాధ్యత" అని ఆయన అన్నారు. ఆరోగ్య సిబ్బంది, అం గన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, విద్యాశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేసి శాతం వంద లక్ష్యాన్ని సాధించాల ని సూచించారు. ఈ సమావేశంలో ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. భాస్కర్, మండల విద్యాశాఖ అధికారి సత్య నారాయణ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు చంద్ర కళ, సుప్రియ, హెచ్ఈఓ కోటిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రాఘవులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని పల్స్ పోలియో కార్య క్రమం నిర్వహణపై చర్చించి అవసరమైన సూచనలు చేశారు.



# పల్స్ పోలియోకు సర్వం సిద్ధం..

**చర్ల, జూన్ 25 (డిడి 9 వార్త )**





చర్ల మండల కేంద్రంలో గురువారం కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సీ)లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక ఆధ్వర్యంలో పల్స్ పోలియో బూత్ కోఆర్డినేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. పుట్టిన శిశువు నుండి ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేయించడం తప్పనిసరని, ప్రతి ఒక్క చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చూడాలని సూచించారు. పోలియో ఒక ప్రమాదకరమైన వైరస్ ద్వారా వ్యాపించే అంటువ్యాధి అని, ఇది పిల్లలలో శాశ్వత వికలాంగత్వానికి దారితీసే అవకాశముందని తెలిపారు. భారతదేశం ఇప్పటికే పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందినప్పటికీ, పొరుగు దేశాలలో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించనున్నట్లు తెలిపారు. కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 32 గ్రామాల్లో ఈ నెల జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రత్యేక పోలియో బూత్‌లతో పాటు బస్టాండ్లు, సంతలు, రద్దీ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్ల లోపు చిన్నారులను సమీప పోలియో బూత్‌కు తీసుకువచ్చి రెండు చుక్కల పోలియో మందు వేయించుకోవాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ రాంప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.



# బెక్కల్‌లో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

**జనగామ జూన్25:(డిడి 9వార్త) బ్యూరో**

దూల్మిట్ట మండలం బెక్కల్ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన, బోనాల ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు ఐకమత్యంతో గ్రామదేవత నల్లపోచమ్మ అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్లా రాజేశ్వర్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా కలిసి బొడ్రాయిని ప్రతిష్ఠించుకోవడం అభినందనీయమన్నారు. గ్రామదేవత ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరి సంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో సంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షిస్తూ ఇలాంటి ఉత్సవాలను నిర్వహించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓయూ రసాయన శాస్త్ర విభాగంపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలి

- **అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారిపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవాలి**
- **ప్రీ-డేటెడ్ సెమినార్ నివేదిక జారీ చేశారంటూ ఏఐఎస్ఎఫ్ ఆరోపణలు**
- **80 మంది విద్యార్థులకు ఒక న్యాయం.. ఒక్కరికే మరో న్యాయమా?**
- **వాస్తవాలు వెలికితీయాలని వైస్ ఛాన్సలర్‌కు విజ్ఞప్తి**
- **నిష్పాక్షిక విచారణ జరపకపోతే ఉద్యమాలు ఉధృతం: ఏఐఎస్ఎఫ్**

**తార్నాక, జూన్ 25 (డీడీ9 వార్త):**

ఉస్మానియా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థుల డిజైన్ సెమినార్ల నిర్వహణలో అక్రమాలు, అధికార దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఓయూ కార్యదర్శి ఐ. లెనిన్ డిమాండ్ చేశారు.

గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ, రసాయన శాస్త్ర విభాగంలో ఒక పీహెచ్‌డీ విద్యార్థికి డిజైన్ సెమినార్ నిర్వహించకుండానే పూర్వ తేదీతో (ప్రీ డేటెడ్ ) నివేదిక జారీ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత విభాగాధిపతులు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ప్రతినిధులు మరియు ఇతర అధికారులు పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు.

డిజైన్ సెమినార్లు పూర్తి చేయని లేదా సమర్పించని దాదాపు 80 మంది పరిశోధక విద్యార్థులకు తదుపరి విద్యా ప్రక్రియల్లో అవకాశం ఇవ్వకపోయినా, ఒక ప్రత్యేక విద్యార్థికి మినహాయింపు కల్పించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ అంశంపై విశ్వవిద్యాలయ యాజమాన్యం వెంటనే స్పందించి, స్వతంత్ర ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించాలని కోరారు.

ఓయూ కార్యదర్శి ఐ. లెనిన్ మాట్లాడుతూ, దేశంలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా పేరుగాంచిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతిష్టకు ఇటువంటి ఆరోపణలు మచ్చ తెస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగం జరిగి ఉంటే అది అత్యంత విచారకరమని పేర్కొన్నారు. ఆరోపణలపై నిష్పాక్షికంగా, పారదర్శకంగా విచారణ నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని, ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు ఉప్పల్ ఉదయ్ కుమార్, సహాయ కార్యదర్శి అశ్వన్ కుమార్, ఉపాధ్యక్షుడు దొంది రామ్, నాయకులు సుమన్, మధు తదితరులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: కడియం శ్రీహరి

**జనగామ జూన్ 25:(డిడి9 వార్త ) బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడి ఇంటికి చేరేలా చర్యలు తీసుకుంటోందని, పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.

రఘునాథపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన 47 మంది కల్యాణలక్ష్మిషాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.47.05 లక్షలు, 24 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.8.32 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

అనంతరం మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు కల్యాణలక్ష్మి పథకం ద్వారా అందిస్తున్న రూ.1,01,116 ఆర్థిక సహాయం తల్లిదండ్రులకు ఎంతో ఊరటనిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, మహిళలు, పేద వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలు ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల కోసం ఎవరూ మధ్యవర్తులకు డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పారదర్శకంగా ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.



నియోజకవర్గ అభివృద్ధికి భారీ నిధులు మంజూరవుతున్నాయని, విద్యుత్ రంగంలో చేపడుతున్న అభివృద్ధి పనులతో భవిష్యత్తులో లోవోల్టేజ్ సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల జగదీశ్ చందర్ రెడ్డి తహసీల్దార్, ఎంపీడీవో, కోళ్ల రవి గౌడ్ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రూ.107 కోట్లతో 4 చెరువుల పునరుద్ధరణ

- **భూమి పూజలతో పనులకు శ్రీకారం**
- **హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రారంభం**
- **వరదల నియంత్రణే ప్రధాన లక్ష్యం**
- **భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు**
- **ఇబ్రహీం, కాముని, భగీరథమ్మ, కాప్రా చెరువుల అభివృద్ధి**
- **పూడిక తొలగించి చెరువులకు కొత్త జీవం**
- **పెద్ద చెరువుల్లో బోటింగ్‌కు ప్రణాళికలు**

**రాజేంద్ర నగర్ (రంగారెడ్డి), జూన్ 25 (డీడీ9 వార్త):**

నగరంలో వరదల నియంత్రణతో పాటు భూగర్భ జలాల పెంపుదలను లక్ష్యంగా పెట్టుకుని హైడ్రా చేపట్టిన చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం వేగవంతమవుతోంది. ఈ క్రమంలో రూ.107 కోట్ల వ్యయంతో మరో నాలుగు కీలక చెరువుల అభివృద్ధి పనులకు హైడ్రా కమిషనర్ ఏ .వి . రంగనాథ్ గురువారం శ్రీకారం చుట్టారు.

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలోని ఇబ్రహీంబాగ్‌లో ఉన్న ఇబ్రహీం పెద్ద చెరువు, గండిపేట మండలం పుప్పాలగూడలోని భగీరథమ్మ చెరువు, కూకట్‌పల్లి మండలం మూసాపేటలోని కాముని చెరువు, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కాప్రాలోని కాప్రా చెరువుల పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. ఇబ్రహీం పెద్ద చెరువు, కాముని చెరువుల వద్ద ప్రత్యేక భూమిపూజలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు.

స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం, హైడ్రా తీసుకుంటున్న చర్యలను అభినందించారు. చెరువుల పునరుద్ధరణతో మురుగు నీటి సమస్య, దోమల బెడద తగ్గడంతో పాటు పరిసర ప్రాంతాలు ఆహ్లాదకరంగా మారనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**చెరువుల అభివృద్ధికి కేటాయించిన నిధులు**

ఇబ్రహీం పెద్ద చెరువు (97 ఎకరాలు) - రూ.29 కోట్లు
కాముని చెరువు (48 ఎకరాలు) - రూ.21 కోట్లు
భగీరథమ్మ చెరువు (54 ఎకరాలు) - రూ.22 కోట్లు
కాప్రా చెరువు (112 ఎకరాలు) - రూ.35 కోట్లు
మొత్తం నాలుగు చెరువుల పునరుద్ధరణకు రూ.107 కోట్లు వెచ్చిస్తున్నారు.

**వరదల నియంత్రణకు చెరువులే కీలకం**

ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ, చెరువుల్లో పేరుకుపో



యిన పూడికను పూర్తిగా తొలగించి దుర్వాసన లేకుండా చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. వరదల నియంత్రణతో పాటు భూగర్భ జలాల పెంపుదల ప్రధాన లక్ష్యమని తెలిపారు.

చెరువుల్లోకి వరద నీరు సాఫీగా చేరేందుకు ఇన్‌లెట్లు, బయటకు వెళ్లేందుకు ఔట్‌లెట్లు ఆధునికంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. మొదటి విడతలో అభివృద్ధి చేసిన ఆరు చెరువుల మాదిరిగానే రెండో విడతలో చేపట్టిన 14 చెరువులను కూడా నాణ్యతతో తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు.

**పర్యాటక కేంద్రాలుగా చెరువులు**

చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల ఆట స్థలాలు, విశ్రాంతి ప్రదేశాలు ఏర్పాటు చేసి అన్ని వయసుల వారికి అనువైన పర్యావరణహిత కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పెద్ద చెరువుల వద్ద పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోటింగ్ సదుపాయం కల్పించే దిశగా కూడా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు.

చెరువుల అభివృద్ధిలో స్థానిక ప్రజలు భాగస్వామ్యం కావాలని, పనుల నాణ్యతను పర్యవేక్షిస్తూ సహకరించాలని హైడ్రా కమిషనర్ పిలుపునిచ్చారు. నగర భవిష్యత్తు కోసం చెరువుల సంరక్షణ అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.







# స్థానికత హక్కుల కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధం

- **హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో సవాల్ చేయాలి**
- **నాలుగేళ్ల క్రితం ఇచ్చిన తీర్పుకు పూర్తి విరుద్ధంగా తాజా తీర్పు**
- **ఒకే అంశంపై కోర్టు తీర్పులు మారకూడదు**
- **ప్రభుత్వం స్పందించకపోతే మేమే పిటిషన్ వేస్తాం**
- **4 ఏళ్ల స్థానికత కాదు.. 15 ఏళ్ల ముల్కీ నిబంధనలు కావాలి**
- **తెలంగాణ హక్కులను కాపాడేందుకు పోరాటం చేస్తాం**
- **తెలంగాణ రక్షణ సేన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత**

**హైదరాబాద్, జూన్ 26 (డీడీ9 వార్త):**

తెలంగాణ స్థానికత, ఉద్యోగ హక్కుల పరిరక్షణ అంశాలపై తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానికత అంశంలో తెలంగాణ యువత హక్కులను కాపాడుకోవడానికి అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధమని ఆమె స్పష్టం చేశారు.

స్థానికతకు సంబంధించి తాజాగా వెలువడిన హైకోర్టు తీర్పుపై స్పందించిన కవిత, నాలుగేళ్ల క్రితం ఇదే అంశంపై అదే కోర్టు పూర్తి విరుద్ధమైన తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ఒకే అంశంపై మూడు, నాలుగేళ్ల వ్యవధిలో పూర్తిగా భిన్నమైన తీర్పులు రావడం ఆందోళనకరమని అన్నారు. న్యాయవ్యవస్థలో కూడా ఒకే విధమైన ప్రమాణాలు ఉండాలని అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టులో మంచి న్యాయవాదులతో హైకోర్టు తీర్పును సవాల్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరుద్యోగులతో కలిసి తామే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

స్థానికత విషయంలో ప్రస్తుతం అమలవుతున్న నాలుగేళ్ల నిబంధనకు బదులుగా, పాత ముల్కీ నిబంధనల మాదిరిగా 15 ఏళ్ల నివాసాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ హక్కుల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

లోకల్ సర్టిఫికెట్ల జారీ విషయంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. గన్ లైసెన్స్ మంజూరులో ఎలాంటి విచారణలు నిర్వహిస్తారో, అదే స్థాయిలో లోకల్ సర్టిఫికెట్ల జారీ సమయంలో కూడా పరిశీలన ఉండాలని కోరారు.

తెలంగాణలో స్థానికేతరుల ప్రవేశం పెరగడానికి జీవో29 ప్రధాన కారణమని ఆరోపించిన కవిత, తెలంగాణ ఫస్ట్ అనే భావనతో జీవో29ను రద్దు



చేసి పాత జీవో55ను తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ఉత్తర్వులు 2018ను వెంటనే అమలు చేసి నియామక ప్రక్రియ చేపట్టాలని కోరారు. నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం కనీసం 20 వేల కానిస్టేబుల్ పోస్టులతో కొత్త నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆమె సూచించారు. రాష్ట్రంలో సుమారు 15 లక్షల మంది యువత ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నారని, వారికి తగిన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

జీవో46 కారణంగా అభ్యర్థులకు నష్టం జరుగుతోందని, దానిని సవరించి నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. గతంలో అమలులో ఉన్న విధంగానే ఏజ్ రిలాక్సేషన్ కొనసాగించాలని సూచించారు.

ఉర్దూ డీఎస్సీ, ఆదివాసీల కోసం ప్రత్యేక డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఆదివాసీలు, ఎస్సీ, ఎస్టీల హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించినట్లు కవిత తెలిపారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో సవాల్ చేయడం, రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 అమలు, జీవో29 రద్దు చేసి జీవో55 పునరుద్ధరణ, కాంగ్రెస్ హయాంలో జరిగిన నియామకాలపై న్యాయ విచారణ, స్థానికతను 15 ఏళ్ల నివాసానికి అనుసంధానం చేయడం వంటి అంశాలపై తీర్మానాలు చేసినట్లు వెల్లడించారు.

## NBK112 రిలీజ్ డేట్.. ఫ్యాన్స్‌కు సూపర్ ట్రీట్

నందమూరి బాలకృష్ణ-కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా ఈరోజు పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభం కానుంది. స్టార్ హీరో-స్టార్ డైరెక్టర్ కాంబో కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రారంభానికి ముందే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇదిలా ఉంటే, ఈ సినిమాను వచ్చే ఏడాది సమ్మర్ కానుకగా విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మరోవైపు, బాలయ్య ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో NBK111 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న చిత్రంలో నటిస్తున్నారు. ఆ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే సంక్రాంతి, సమ్మర్ మధ్య పెద్దగా గ్యాప్ లేకుండానే బాలయ్య అభిమానులను రెండు సినిమాలతో అలరించే అవకాశం ఉంది. దీంతో ఈ రెండు చిత్రాలు తక్కువ వ్యవధిలోనే విడుదలై బ్లాక్‌బస్టర్ విజయాలు సాధిస్తే బాగుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక ఈ సినిమాల విడుదల తేదీలపై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందన్నది ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది.



## స్టార్ బ్యూటీ కోసం వెతుకులాట ప్రారంభించిన 'ఓజీ 2' యూనిట్..

వర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, సుజిత్ దర్శకత్వంలో రూపొందిన 'ఓజీ' సినిమా మంచి అంచనాల మధ్య విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్‌గా నటించగా, సినిమాలో ఆమె పాత్ర ముగిసిపోవడం తెలిసిందే. ఇదిలా ఉంటే, ప్రస్తుతం 'ఓజీ 2'కి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించడంతో ఈ సీక్వెల్‌పై ఆసక్తి మరింత పెరిగింది. దీంతో ఇప్పుడు ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన హీరోయిన్‌గా ఎవరు కనిపించబోతున్నారు అనే చర్చ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.

ప్రస్తుతం దర్శకుడు సుజిత్, ఈ సినిమాలో పవన్‌కు జోడీగా ఓ బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అందుకోసం ఇప్పటికే వెతుకులాట కూడా ప్రారంభించినట్లు సమాచారం. అయితే పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ బిజీ షెడ్యూల్‌లో ఉన్న నేపథ్యంలో, ఆయనకు అనుకూలమైన తేదీల్లోనే షూటింగ్ జరిపే అవకాశం ఉంది.

ఈ కారణంగా స్టార్ హీరోయిన్ అయితే ఆమె తేదీలను కూడా అందుకు అనుగుణంగా సెట్ చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో స్టార్ హీరోయిన్‌ను తీసుకుంటే డేట్స్ పరంగా ఎలాంటి ఇబ్బందులు వస్తాయా అనే కోణంలో కూడా మేకర్స్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. మరి 'ఓజీ 2' కోసం నిజంగానే ఓ స్టార్ హీరోయిన్‌ను రంగంలోకి దింపుతారా? లేక షూటింగ్ ప్లానింగ్ సులభంగా ఉండేలా మరో ఆప్షన్‌ను ఎంచుకుంటారా? అన్నది ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చగా మారింది.



## మోహన్‌లాల్‌తో భాగ్యశ్రీ?

'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యింది అందాల తార భాగ్యశ్రీ బోర్సే. తనదైన నటనతో కుర్రకారుని అలరించే ఈ భామ.. ఇప్పుడు మలయాళ చిత్రపరిశ్రమలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. అగ్రహీరో మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఎల్367' (వర్కింగ్ టైటిల్). విష్ణు మోహన్ తెరకెక్కిస్తున్నారు. ఈ మధ్యే ప్రకటించిన ఈ సినిమాలో నాయికగా భాగ్యశ్రీ బోర్సేని ఎంపిక చేసిందట చిత్ర బృందం. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, వచ్చే నెల నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.



## యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్న 'తెల్ల కాగితం' ఫస్ట్ సింగిల్



టాలీవుడ్ యంగ్ హీరో హర్ష రోషన్, దర్శకుడు రమేష్ బండ్రెడ్డి కాంబినేషన్‌లో రాబోతున్న సరికొత్త యూత్‌ఫుల్ మ్యూజికల్ లవ్ స్టోరీ 'తెల్ల కాగితం'. ఈ చిత్రంలో హర్ష రోషన్ సరసన నక్షత్ర హీరోయిన్‌గా నటిస్తోంది. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై కృష్ణ కొమ్మలపాటి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 'బేబీ' సినిమాతో సౌత్ ఇండియాలోనే సెన్సేషన్ సృష్టించిన మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్ ఈ సినిమాకు అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్స్ డోస్ పెంచుతూ తాజాగా ఈ సినిమా మ్యూజికల్ జర్నీని ప్రారంభించింది. ఇందులో భాగంగా 'తెల్ల కాగితం' చిత్రంలో ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. ''చిలక' అని సాగే ఈ పాట మనసులో నిలిచిపోయేలా మృదువుగా, ఆహ్లాదకరంగా సాగే, కళాశాల నేపథ్యంలో సాగే ఒక చక్కని ప్రేమ గీతం'' అనే క్యాప్షన్‌తో ఈ పాటను వదిలారు. కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ లవ్ సాంగ్ యూత్‌ను ఎంతగానో ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో కూడా మంచి వ్యూస్‌తో ట్రెండింగ్‌గా మారింది.

## ఇండస్ట్రీలో మంచి ఆఫర్లు రావడం చాలా అరుదు

డిజిటల్ కంటెంట్, వెబ్ సిరీస్‌ల ద్వారా నటి మిథిలా పాల్కర్ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. హిందీ, తమిళ, మలయాళ చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఇటీవల 'భూత్ బంగ్లా' మూవీలో కీలక పాత్రలో నటించిన ఆమె బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం తన చేతిలో ఏ ప్రాజెక్ట్ లేకపోవడంతో పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ ఆసక్తికర కామెంట్లు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. సినిమా ఇండస్ట్రీలో తనకు వస్తున్న ఆఫర్లు, సోషల్ మీడియాలో జరిగే ట్రోలింగ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పరిశ్రమలో తనకు నచ్చిన కథలను ఎంచుకునే అవకాశం రావడం వెనుక ఉన్న అసలు విషయాలను పంచుకున్నారు. అనుకున్నంతగా మంచి ఆఫర్లు రావడం లేదని ఆమె ఓపెన్‌గా చెప్పేశారు. అవకాశాలు వస్తున్నప్పటికీ.. అవన్నీ మనసుకు నచ్చేలా, తాను చేయాలనుకునే కథల్లా ఉండట్లేదని తెలిపారు. ఇండస్ట్రీలో నిజంగా నచ్చే, మంచి ఆఫర్లు రావడం అనేది చాలా అరుదుగా జరుగుతుందని.. అయితే, ఇప్పుడు తనకు నచ్చిన పాత్రలను మాత్రమే ఎంచుకుంటూ.. ఒక మంచి పొజిషన్‌లో ఉండటం తన అదృష్టమని మిథిలా చెప్పుకొచ్చారు. అలాగే ట్రోల్స్, నెగిటివిటీ గురించి మాట్లాడుతూ.. కాలంతో పాటు తనకు ఒక మంచి అభిమానుల గ్రూప్ ఏర్పడిందని, అందుకు తాను ఎంతో రుణపడి ఉంటానని మిథిలా తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరైనా తనపై తప్పుడు కామెంట్స్ పెట్టినా, హేట్ కామెంట్స్ చేసినా.. తన ఫ్యాన్స్ అందరూ గ్రూప్‌గా వచ్చి వాళ్లకు గట్టిగా సమాధానం ఇస్తారని చెప్పారు. ఆ సమయంలో తాను ఏమీ చేయాల్సిన అవసరం ఉండదని, తన తరఫున అభిమానులే మాట్లాడతారని.. వారి ప్రేమ చూస్తుంటే మనసుకు చాలా సంతోషంగా అనిపిస్తుందని మిథిలా పాల్కర్ ఎమోషనల్ అయ్యారు.



## 'ధర్మన్' కోసం భారీ ప్లాన్.. 8 సాంగ్స్‌తో మ్యూజికల్ ఫీస్ట్



పర్ స్టార్ రజనీకాంత్, 'ఓ మై కడవులే', 'డ్రాగన్' చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి 'ధర్మన్' (ది డెడ్లీ డాక్టర్) అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్‌ను లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత బ్యానర్ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌పై నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సీనియర్ హీరోయిన్ సిమ్రాన్, యంగ్ బ్యూటీ రాశీ ఖన్నా ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. అలాగే అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నారు. నిన్న విడుదలైన ఈ సినిమా టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది.

ఇదిలా ఉంటే, ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించిన మరో క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అదేమిటంటే... ఈ సినిమాలో మొత్తం ఎనిమిది పాటలు ఉండబోతున్నట్లు సమాచారం. అంతేకాకుండా, ఆ ఎనిమిది పాటలు కూడా విభిన్న జానర్లలో ఉండనున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా రజనీకాంత్ ఇంట్రో సాంగ్ చాలా సాలిడ్‌గా ఉండబోతుందని, ఇప్పటికే ఆ ట్యూన్‌ను అనిరుధ్ సిద్ధం చేసినట్లు టాక్ వినిపిస్తోంది. మరి నిజంగానే ఈ సినిమాలో ఎనిమిది పాటలు ఉంటాయా? ఉంటే అవి ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటాయో చూడాలి.

## 20 భాషల్లో 'వారణాసి'..

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. హిందీ సినిమాల ద్వారా అద్భుతమైన గుర్తింపును సంపాదించుకున్న ఆమె, అనేక హాలీవుడ్ చిత్రాల్లో నటించి ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకమైన క్రేజ్‌ను సంపాదించుకుంది. ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'వారణాసి'లో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ప్రియాంక చోప్రా 'వారణాసి' చిత్రం గురించి కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ప్రియాంక మాట్లాడుతూ.. ఒకప్పుడు ప్రాంతీయ భాషల సినిమాలు, సిరీస్‌లు చాలా పరిమిత ప్రాంతానికే పరిమితమయ్యేవని, కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని అన్నారు. మంచి కథ, బలమైన కంటెంట్ ఉన్న చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణను పొందుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఇదే సందర్భంగా 'వారణాసి' సినిమా గురించి మాట్లాడుతూ.. తాను ప్రస్తుతం వారణాసి చిత్రంలో నటిస్తున్నానని, ఈ సినిమాను దాదాపు 20 భాషల్లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారని వెల్లడించారు. దీంతో ప్రాంతీయ చిత్రాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఎలా పెరుగుతోందో అర్థమవుతుందని ప్రియాంక చోప్రా చెప్పుకొచ్చారు. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలతో 'వారణాసి' ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.